గురువారం
22-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 180
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

వణికిన ఉత్తర కాలిఫోర్నియా

- 6.4 తీవ్రతతో భూకంపం
- భారీగా ఆస్తినష్టం
- ఇద్దరి మృతి- 12 మందికి గాయాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా
- అంధకారంలో 70 వేల మంది

2లో

చట్టం... అమాయకుల్ని బెదిరించే

అస్త్రం కాదు

సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: చట్టం అమాయకులకు రక్షణ కవచంగా ఉండాలి తప్ప...బెదిరించే అస్త్రం కాకూడదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. చెమ్ ఫార్మా యజమాని హస్‌ముఖ్‌లాల్ డి.వోరా, ఆయన తనయుడిపై తమిళనాడు మాదకద్రవ్యాల నియంత్రణ యంత్రాంగం నమోదు చేసిన క్రిమినల్ కేసును సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. తొలుత జరిగిన సైట్ పర్యవేక్షణ, షోకాజ్ నోటీసు జారీ...ఆపై ఫిర్యాదు నమోదుకు నాలుగేళ్లకుపైగా జరిగిన అసాధారణ జాప్యంపై ప్రతివాది వివరణ ఇవ్వలేదని తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో దీని వెనుక దురుద్దేశమేదో ఉందన్న అనుమానం కలుగక మానదని వ్యాఖ్యానించింది. తండ్రీకొడుకులపై క్రిమినల్ కేసు కొట్టివేస్తూ ఆదేశాలు జారీచేసింది. క్రిమినల్ కేసుల విచారణ నెపంతో ఏళ్ల తరబడి నిందితులను వేధించడం తగదని స్పష్టంచేసింది. ఇలాంటివి అమాయకులను వేధించేందుకు

- మిగతా 2 లో

భారత్‌లోకి బీఎఫ్-7

మూడు కేసులు నమోదు

కోవిడ్-19 తొలిసారి వెలుగు చూసిన చైనాలో మహమ్మారి మరోసారి ఉగ్రరూపం దాల్చింది. అయితే, ఈసారి అక్కడ వైరస్ విజృంభణకు ఒమిక్రాన్ ఉపరకమైన బీఎఫ్-7 కారణమని నిపుణులు చెబుతున్నారు.

2లో

మాస్కులు తప్పనిసరి

- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం
- కరోనాపై అప్రమత్తత అవసరం
- నిఘా పటిష్టవంతం చేయండి
- అందరూ బూస్టర్ దోసులు వేసుకోండి
- కేంద్రమంత్రి మాండవీయ సమీక్ష

2లో

చైనాతో ఘర్షణపై

చర్చిద్దాం

- విపక్షాల డిమాండ్... వాకౌట్
- పార్లమెంటు ఆవరణలో ధర్నా

న్యూఢిల్లీ: చైనాతో సరిహద్దు అంశంపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల సభ్యులు బుధవారం లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. చైనా అంశంపై చర్చకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో కాంగ్రెస్, ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) సభ్యులు సభను బహిష్కరించారు. తర్వాత తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), జనతా దళ్(యూ) సభ్యులు కూడా సభ నుంచి బయటకు వచ్చేశారు. సభలో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదురి... భారత-చైనా అంశంపై చర్చకు అనుమతించాలని స్పీకర్ ఓం బిర్లాను కోరారు. ఇది ప్రతిపక్షం హక్కు అని అన్నారు. 'మేము ఉదయం నుంచి చైనా అంశంపై చర్చకు డిమాండ్ చేస్తున్నాం. టీవీలో, బయట (పార్లమెంటు) ప్రతిచోటా దానిపై చర్చ జరుగుతోంది. దానిపై చర్చించేందుకు ప్రతిపక్షానికి ఒక అవకాశం ఇవ్వండి. అది మా హక్కు' అని తెలిపారు. టీఎంసీ సభ్యుడు సుదీప్

- మిగతా 2 లో

జీతాలే ఇవ్వలేరు

ఉచితాలు, రాయితీలా?

ఏపీపై మంత్రి నిర్మలా సీతారామన్ పరోక్ష ఎత్తిపొడుపు

న్యూఢిల్లీ: ప్రతి ఒక్కరూ తాము అనుసరించే విధానాల్లో పారదర్శకత ఉందా? లేదా? అనే విషయాన్ని గుర్తించాలని, ఉచితాలపై ఇక్కడ చర్చకు తావేలేదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రాజ్యసభలో బుధవారం గ్రాంట్ల అనుబంధ డిమాండ్లపై జరిగిన చర్చకు సీతారామన్ సమాధానమిస్తూ...వివిధ అంశాలపై మాట్లాడారు. ఇంధనం, ఎరువుల ధరల కారణంగా దేశంలో ద్రవ్యోల్బణం పెరిగిందని తెలిపారు. 'ఒక రాష్ట్ర ప్రభుత్వం సమయానికి ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి రావడంతో ఉద్యోగులంతా నిరసనకు దిగారని మీడియాలో వార్తలొచ్చాయి. ఆ ప్రభుత్వం నిధులన్నింటినీ దేశవ్యాప్తంగా భారీ ప్రకటనలకు ఖర్చు చేయడమే ఈ దుస్థితికి కారణం. రాయితీలు, ఉచితాలు సందర్భోచితంగా ఉండాలి. ఒకవేళ మీరు బడ్జెట్‌లో వాటిని పెడితే అందుకు తగిన విధంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి. మీకు ఆదాయం ఉంటే డబ్బులు ఇవ్వొచ్చు. ఈ విషయంలో మీకెవరూ అభ్యంతరం చెప్పరు' అని ఆమె అన్నారు. విద్య, ఆరోగ్యం, రైతులకు రాయితీలు వంటివి ఇవ్వడం న్యాయమేనని చెప్పారు. తన మాటల్లో ఏ ఒక్క రాష్ట్రం పేరును సీతారామన్ ప్రస్తావించలేదు. ఇటీవల ఏపీ ప్రభుత్వం జీతాలు ఇవ్వడం ఆలస్యం చేయడంతో ఉద్యోగులు ఆందోళన చేపట్టిన సంగతి విదితమే. 'చట్టబద్ధ నిబంధనలతో కూడిన పారదర్శకతను మేము కోరుకుంటాం. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు సైతం మాంద్యం పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. కోవిడ్ పరిస్థితులు, వాటి నియంత్రణకు అవి ఎంచుకున్న మార్గం..,మనం అనుసరించిన మార్గానికి పూర్తి భిన్నంగా ఉండటమే అందుకు కారణం. మన విధానాలతో ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవనం చేయడం ద్వారా సురక్షితంగా ఉన్నాం. అందుకే మాంద్యం కోరల్లో మనం చిక్కుకోలేదు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహ పథకాల ద్వారా ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. ద్రవ్యోల్బణం విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉన్నా, ప్రస్తుతం దాని చలనానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా చమురు, ఎరువుల ధరల పెరుగుదల ప్రభావం ద్రవ్యోల్బణంపై పడుతోంది' అని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇటీవల కాలంలో నిరుద్యోగిత రేటు క్రమంగా తగ్గుతూ వస్తోందని ది పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే గణాంకాలు చెబుతున్నట్లు సీతారామన్ తెలిపారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాల

- మిగతా 2 లో

మేమే కమిటీ వేస్తాం

రిషికొండపై హైకోర్టు స్పష్టీకరణ

నేటికి విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్ సర్కారుకు న్యాయస్థానాల్లో పదేపదే ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా విశాఖలోని రిషికొండ కమిటీ అంశంలోనూ హైకోర్టు షాక్ ఇచ్చింది. రిషికొండపై క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పరిశీలనకుగాను తామే కమిటీని నియమిస్తామని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. అనుమతికి మించి తవ్వకాలు జరుపుతున్నారంటూ టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. రిషికొండపై తవ్వకాలు, నిర్మాణ భవనాలపై క్షేత్రస్థాయిలో పరిశీలనకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ, సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో కమిటీ వేయాలని హైకోర్టు గతంలో ఆదేశించింది. అయితే ఆ కమిటీలో ముగ్గురు రాష్ట్ర ప్రభుత్వ అధికారులను సభ్యులుగా చేర్చడంపై పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టు సైతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను నియమించమంటే...రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కమిటీలో ఎలా నియమిస్తారని కేంద్రాన్ని హైకోర్టు ప్రశ్నించింది. కమిటీ సభ్యుల నియామకాన్ని సమర్థిస్తున్నామని కేంద్రం తెలిపింది. దీనిపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేస్తూ...కేంద్ర ఉద్యోగులతో కమిటీని తామే నియమిస్తామని స్పష్టం చేసింది. కమిటీలపై ఉన్న అభ్యంతరాలను అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. ఈ కేసు విచారణను గురువారం నాటికి హైకోర్టు వాయిదా వేసింది.

పేదల ఆత్మగౌరవం పెరగాలంటే

ప్రభుత్వ భూములు పంచాల్సిందే

- మరో భూ పోరాటానికి సన్నద్ధం
- నవరత్నాల్లో కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు చేర్చాలి
- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో భూ సాధన రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేదల ఆత్మగౌరవం పెరగాలంటే తక్షణమే ప్రభుత్వం భూములు పంచాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో నిర్వహించిన భూ సాధన రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో చేర్చి, గ్రామీణ పేదలకు భూ పంపిణీ వెంటనే చేపట్టాలని తీర్మానించింది. విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యాన భూ సాధన రాష్ట్ర సదస్సు జరిగింది. సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్ అధ్యక్షత వహించారు. తొలుత రిటైర్డు ఐఏఎస్ అధికారి, కోనేరు రంగారావు భూ కమిటీ కార్యదర్శి కొప్పుల రాజు ప్రారంభోపన్యాసం చేస్తూ... భూ సాధన పోరాటాలతో పాటు సమాజంలోని కుల నిర్మూలనపైనా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. భూపోరాటాలు చేసిన చరిత్ర ఒక్క కమ్యూనిస్టులదేనని, ఆ పోరాటాల ద్వారా అనేక చట్టాలు వచ్చాయని, యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ హక్కు పథకం ఒకటని తెలిపారు. నాటి తెలంగాణ సాయుధ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మేం కూడా రెడీ సార్, దీపాలు వెలిగించడానికి కంచాలు, తపేలాలు బాదడానికి!

చదువుతో అసమానతలకు చెక్

- సీఎం వైఎస్ జగన్
- 4.5 లక్షల మందికి ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: సమాజంలో అసమానతలు పోవాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గమని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం, యడ్లపల్లి గ్రామంలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వతరగతి చదువుతున్న 4,59,564 మంది విద్యార్థులు, 59,176 మంది ఉపాధ్యాయులకు రూ.778 కోట్ల బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్, రూ.686 కోట్ల విలువైన 5,18,740 శామ్‌సంగ్ ట్యాబులు ఉచిత పంపిణీకి శ్రీకారం చుట్టారు. తరాలు మారుతున్నా కొన్ని వర్గాల తలరాతల మారకూడదనన్న పెత్తందారుల భావాలను బద్దలకొడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టామని సీఎం జగన్ తెలిపారు. పిల్లలు ఇంగ్లిష మీడియంలో చదవకూడదని డిజిటల్ పద్ధతుల్లో పిల్లలకు చదువులు చెప్పకూడదని చెప్పే పెత్తందార్లు ఆరాటపడుతున్నారన్నారు. మూడున్నరేళ్ల వైసీపీ

- మిగతా 2 లో

రూ.2500కోట్లతో కృష్ణానదిపై బ్యారేజీ

కృష్ణానది మీద ఓలేరు-తూర్పు పాలెం గ్రామాలు, భట్టిప్రోలు మండలంలో 4.96టీఎంసీల సామర్థ్యంతో రూ.2500 కోట్లతో బ్యారేజీ నిర్మాణ పనుల కోసం అడిగా, దీనికి సంబంధించిన అంచనాలు పూర్తయ్యాయని ఏప్రిల్ నుంచి టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి పనులు కూడా మొదలవుతాయని జగన్ తెలిపారు.. జంపని షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల సమస్య పరిష్కారం చేస్తానని సీఎం తెలిపారు. రూ.17.6 కోట్లతో రోడ్ల నిర్మాణం కోసం పీఎంజీఎస్‌వై కింద మంజూరు చేస్తున్నామన్నారు. 1811ఎకరాల సాగు చేస్తున్న కొల్లూరు, భట్టిప్రోలు

- మిగతా 2 లో

జోడో యాత్ర ఆపండి

రాహుల్‌కు కేంద్రమంత్రి మాండవీయ లేఖ

న్యూఢిల్లీ: చైనా సహా అనేక దేశాల్లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతుండటంతో దేశంలో మరోసారి మహమ్మారి కలవరం మొదలైంది. దీంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న 'భారత్ జోడో యాత్ర'తో వైరస్ వ్యాప్తి చెందే ముప్పు ఉందని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీంతో కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ రాహుల్‌కు బుధవారం లేఖ రాశారు. కోవిడ్ నిబంధనలు పాటించలేకపోతే...యాత్రను కొంతకాలం నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. 'భారత్ జోడో యాత్ర' కారణంగా తమ రాష్ట్రంలో కరోనా వ్యాప్తి చెందే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తూ రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు ఎంపీలు డిసెంబరు 20న మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు లేఖ రాశారు. యాత్రలో పాల్గొన్న హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుక్కు కరోనా బారిన పడిన విషయాన్ని ఆరోగ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జోడో యాత్రలో కోవిడ్ నిబంధనలు

- మిగతా 2 లో

భారత్‌లోకి బీఎఫ్-7

న్యూఢిల్లీ: కోవిడ్-19 తొలిసారి వెలుగు చూసిన చైనాలో మహమ్మారి మరోసారి ఉగ్రరూపం దాల్చింది. అయితే, ఈసారి అక్కడ వైరస్ విజృంభణకు ఒమిక్రాన్ ఉపరకమైన బీఎఫ్-7 కారణమని నిపుణులు చెబుతున్నారు. తాజాగా ఆ వేరియంట్ భారత్‌కూ వ్యాపించింది. తొలి కేసును గుజరాత్ బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ అక్టోబర్‌లోనే గుర్తించింది. దేశవ్యాప్తంగా ఈ వేరియంట్ కేసులు ఇప్పటి వరకు మూడు నమోదైనట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గుజరాత్‌లో రెండు కేసులు, ఒడిశాలో మరో కేసు వెలుగు చూసినట్లు తెలిపాయి. భారత్‌లో కొత్త వేరియంట్ వెలుగు చూసినప్పటికీ మొత్తం కేసుల్లో పెరుగుదల గణనీయంగా లేదని కోవిడ్‌పై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో నిపుణులు వెల్లడించారు. అయినప్పటికీ...వ్యాప్తిలో ఉన్న వాటితోపాటు కొత్తగా బయటపడుతోన్న వేరియంట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ అవసరమని సూచించారు. అధికారిక వర్గాల ప్రకారం చైనాలో ఒమిక్రాన్ వేరియంట్, దాని ఉపరకాల విజృంభణ కొనసాగుతోంది. బీజింగ్ వంటి నగరాల్లో బీఎఫ్-7 వేరియంట్ ప్రధానంగా వ్యాప్తిలో ఉంది. ఈ వేరియంట్ కారణంగానే చైనా వ్యాప్తంగా కోవిడ్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇదివరకు ఇన్‌ఫెక్షన్ బారిన పడకపోవడం, వాక్సిన్ సమర్థత కారణంగా అక్కడి ప్రజలు తక్కువ రోగనిరోధక శక్తి కలిగి ఉండటం వంటివి చైనాలో వైరస్ విస్తృతంగా వ్యాప్తి చెందడానికి కారణంగా తెలుస్తోందని భారత ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

బీఎఫ్-7 వేరియంట్ అంటే ఏమిటి?

ఒమిక్రాన్ వేరియంట్ బీఏ-5కు చెందిన ఉపరకమే బీఎఫ్-7. విస్తృత వేగంతో వ్యాప్తి చెందే ఈ వేరియంట్‌కు బలమైన ఇన్‌ఫెక్షన్ కలిగించే సామర్థ్యం ఉంది. దీని ఇంక్యుబేషన్ వ్యవధి చాలా తక్కువ. అంతేకాకుండా రీఇన్‌ఫెక్షన్ లేదా వాక్సిన్ తీసుకున్న వారికీ ఇన్‌ఫెక్షన్ కలిగించే సామర్థ్యం ఈ వేరియంట్‌కు ఉంది. చైనాలోనే కాకుండా అమెరికా, బ్రిటన్, బెల్జియం, జర్మనీ, ఫ్రాన్స్, డెన్మార్క్ వంటి దేశాల్లోనూ ఈ వేరియంట్ ఇప్పటికే వెలుగు చూసింది.

మాస్కులు తప్పనిసరి

న్యూఢిల్లీ: ప్రపంచ దేశాల్లో కరోనా కేసులు మళ్లీ అకస్మాత్తుగా పెరుగుతున్నాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. రద్దీ ప్రదేశాల్లో ప్రజలు మాస్కు లు ధరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. చైనా, జపాన్, అమెరికా సహా అనేక దేశాల్లో కరోనా మహమ్మారి పరిస్థితులపై అంచనా వేసేందుకు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అధ్యక్షతన బుధవారం ఇక్కడ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. కరోనా పరిస్థితులను చర్చించి చర్యలు తీసుకొనేందుకు ప్రతివారం ఉన్నతస్థాయి కమిటీ భేటీ కావాలని నిర్ణయించారు. ప్రపంచ దేశాల్లో కొత్త కేసులు పెరుగుతున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఆదేశించారు. కరోనా ఇంకా ముగిసిపోలేదని, అప్రమత్తంగా ఉండాలని, నిఘాను మరింత పటిష్టమంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు మాండవీయ తెలిపారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన ట్వీట్ చేశారు. ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే పాల్, జాతీయ టీకా సాంకేతిక సలహా బృందం చైర్మన్ ఎన్ఎల్ అరోడా, ఐసీఎంఆర్ డీజీ డా.రాజీవ్ బహల్, ఇతర ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఆరోగ్య, ఆయుష్, ఔషధ, బయోటెక్నాలజీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. కరోనాపై ఏర్పాటు చేసిన జాతీయ టాస్క్‌ఫోర్స్ అధిపతి వీకే పాల్ మాట్లాడుతూ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తగినన్ని పరీక్షలు చేస్తున్నామని, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు మాస్కులు ధరించాలని సూచించారు. ఇప్పటివరకు కేవలం 27-28శాతం మంది మాత్రమే అర్హులైనవారు బూస్టర్ డోసు వేసుకున్నారని, అర్హులైన ప్రతిఒక్కరూ వేసుకోవాలని సూచించారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారంతా తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. అంతర్జాతీయ విమాన ప్రయాణానికి సంబంధించిన మార్గదర్శకాల్లో ఇంకా ఎలాంటి మార్పులూ లేవన్నారు. ప్రపంచ దేశాల్లో కరోనా కేసులు పెరుగుతుండటంతో అప్రమత్తమైన కేంద్రం ఇప్పటికే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక సూచనలు చేసింది. వైరస్ కొత్త వేరియంట్‌లను ఎప్పటికప్పుడు గుర్తించడానికిగాను పాజిటివ్ నమూనాల పూర్తి జన్యు క్రమాన్ని విశ్లేషించాల్సిన అవసరాన్ని గుర్తించాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖ రాశారు. దీనికోసం కోవిడ్ పాజిటివ్‌గా తేలిన నమూనాలను ప్రతి రోజు సార్స్ కోవ్-2 జినోమిక్స్ కన్సార్టియం(ఇన్సాకాగ్) పరీక్ష కేంద్రాలకు పంపించాలని సూచించారు. ప్రస్తుతం మన దేశంలో క్రియాశీల కేసులు 4వేల దిగువనే ఉన్నాయి. అయితే, చైనా సహా జపాన్, దక్షిణ కొరియా, బ్రెజిల్, అమెరికా దేశాల్లో కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. అమెరికాలో మొత్తం కేసుల సంఖ్య 10 కోట్లు దాటింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలపై దృష్టిపెట్టింది.

చైనాతో ఘర్షణపై చర్చిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

బందోపాధ్యాయ కూడా చర్చకు డిమాండ్ చేశారు. అనంతరం సభలో మళ్లీ మాదక ద్రవ్యాలపై చర్చ మొదలయింది. కాగా భారత్-చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలపై చర్చకు డిమాండ్ చేస్తూ బుధవారం పార్లమెంటు సముదాయంలోని మహాత్మా గాంధీ విగ్రహం సమీపంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ నేతృత్వం వహించారు. సీపీఐ, సీపీఎం, ఆర్‌జేడీ, జేడీ(యూ), శివసేన, డీఎంకే, ఎన్‌సీపీ సహా 12 ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చైనాతో ఘర్షణ అంశంపై పార్లమెంటులో ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని, ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. కాగా ఈ అంశంపై చర్చ కోరుతూ పార్లమెంటు ఉభయసభల్లో అనేక మంది ప్రతిపక్ష ఎంపీలు వాయిదా తీర్మానాలు ఇచ్చారు.

జీతాలే ఇవ్వలేరు

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా అంకుర సంస్థలు ఆవిర్భవించి, ఆర్థిక వ్యవస్థలోకి పెట్టుబడులు పెరుగుతాయని, తద్వారా ఉపాధి కల్పన జరుగుతోందన్నారు. ఇక స్థూల నిరర్థక ఆస్తులు 5.9శాతం తగ్గడం ద్వారా ఆరేళ్ల కనిష్ఠానికి చేరాయని వివరించారు. కార్పొరేట్ రంగానికి సంబంధించిన బ్యాలెన్స్ షీట్‌లో రుణాలు సైతం తగ్గుముఖం పట్టాయని అన్నారు. 2016 మార్చి నాటికి జీడీపీలో అత్యధికంగా 91.4శాతంగా ఉన్న రుణ రేటు జూన్ 2022 నాటికి 87.8శాతానికి తగ్గిందని నిర్మలా సీతారామన్ వివరించారు.

వణికిన ఉత్తర కాలిఫోర్నియా

6.4 తీవ్రతతో భూకంపం - భారీగా ఆస్తినష్టం
ఇద్దరి మృతి- 12 మందికి గాయాలు
నిలిచిన విద్యుత్ సరఫరా - అంధకారంలో 70వేల మంది

రియో డెల్: ఉత్తర కాలిఫోర్నియా శక్తిమంతమైన భూకంపం ధాటికి వణికిపోయింది. ఇళ్లు పేకమేడల్లా కూలిపోగా 12 గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో 70వేల మందికిపైగా అంధకారంలో చిక్కుకున్నారు. రోడ్లు-భవనాలు దెబ్బతిన్నాయి. మంగళవారం తెల్లవారుజామున 2.34 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) పసిఫిక్ తీరం సమీపంలో శాన్ ఫ్రాన్సిస్కోకు నైరుతి దిశగా 210 మైళ్ల దూరంలోని ఫెర్న్‌డలే వద్ద భూమి కంపించినట్లు అధికారులు తెలిపారు. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదైందని, తీరానికి పది మైళ్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నదని చెప్పారు. ఆ తర్వాత కూడా అనేకసార్లు ప్రకంపనలు చోటుచేసుకున్నాయని అధికారులు వెల్లడించారు. భూకంపం వల్ల అత్యవసర వైద్య సాయం అందక ఇద్దరు వృద్ధులు చనిపోయారని, మరో 12 మందికి గాయాలయ్యాయని హంబోల్డ్ కౌంటీ షరీఫ్ కార్యాలయం వెల్లడించింది. రియోడెల్, ఫెర్న్‌డలే, ఫోర్టునాలో భూకంపం వల్ల నష్టం జరిగిందని అత్యవసర సేవల డైరెక్టర్ మార్క్ గిలార్డుసీ తెలిపారు.

ఫెర్నడలే బ్రిడ్జి దెబ్బతిన్నదని, దానిని మూసివేశామని చెప్పారు. రియోడెల్‌లో భూకంపం ధాటికి 3వేల మంది అల్లాడిపోయారని, 15 ఇళ్లు పూర్తిగా దెబ్బతినగా మరో 18 పాక్షికంగా దెబ్బతిన్నాయని అధికారులు చెప్పారు. 30 మంది సర్వం కోల్పోగా వీరి సంఖ్య 150కు పెరగవచ్చునన్నారు. ఈ ప్రాంతంలో అధికంగా ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా ఉన్నదని అధికారులు వెల్లడించారు.

అమెరికాకు జెలెన్‌స్కీ

యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడి తొలి విదేశీ పర్యటన

వాషింగ్టన్: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ బుధవారం అమెరికాలో పర్యటించారు. రష్యాతో యుద్ధం మొదలైన తర్వాత ఆయన తొలిసారి విదేశీ పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో భేటీ అవుతారు. అమెరికా కాంగ్రెస్‌లో ప్రసంగిస్తారు. అక్కడి కీలక సభ్యులతో సమావేశమవుతారు. ఈ వివరాలను జెలెన్‌స్కీ స్వయంగా వెల్లడించారు. ఇటీవల శ్వేతసౌధం దాదాపు 2 బిలియన్ డాలర్ల ప్యాకేజీని ఉక్రెయిన్ కోసం ప్రకటించింది. యుద్ధం మొదలైన 300వ రోజు జెలెన్‌స్కీ వాషింగ్టన్ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. అటు రష్యా దళాలను దీటుగా ఎదుర్కొనేందుకు ఆయుధ-ఆర్థిక సాయాన్ని ప్రాశ్చాత్య దేశాల నుంచి ఉక్రెయిన్ పొందుతున్న విషయం విదితమే. రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచుకొని స్వీయ సమృద్ధిగా మరింత బలంగా మారేందుకు అమెరికాకు బయల్దేరి వెళుతున్నానని తన ప్రయాణానికి ముందు జెలెన్‌స్కీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్‌లో ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.

ఉక్రెయిన్ పునరుద్ధరణకు ప్రపంచ బ్యాంకు ప్యాకేజీ

వాషింగ్టన్: ఉక్రెయిన్ పునరుద్ధరణ కోసం 610 మిలియన్ డాలర్ల ఆర్థిక ప్యాకేజీని ప్రపంచ బ్యాంకు ఆమోదించింది. యుద్ధం కారణంగా అస్తవ్యస్థమైన దేశం తిరిగి పుంజుకునేందుకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించింది. 500 మిలియన్ డాలర్లను పబ్లిక్ ఎక్స్‌పెండీచర్ ఫర్ అడ్మినిస్ట్రేటివ్ కెపాసిటీ ఎండ్యూరెన్స్ (పరిపాలన సామర్థ్యం పెంపునకు ప్రజా వ్యయం) (పీస్) కింద అందించనున్నట్లు తెలిపింది. మరో 110 మిలియన్ డాలర్లను ఆరోగ్య పరిస్థితుల మెరుగుదల (హీల్ ఉక్రెయిన్) ప్రాజెక్టు కోసం ఇస్తున్నట్లు వెల్లడించింది.

ఎన్‌సీ పార్లమెంటరీ పార్టీ నేతగా డ్యూబా

ఖాట్మండు: నేపాల్ ప్రధాని, నేపాలీ కాంగ్రెస్ (ఎన్‌సీ) అధ్యక్షుడు షేర్ బహదూర్ డ్యూబా బుధవారం పార్లమెంటరీ పార్టీ (పీపీ) నేతగా ఎన్నికయ్యారు. పార్టీ ప్రధాన కార్యదర్శి గగన్ కుమార్ థాపాను 39 ఓట్లతో ఓడించారు. డ్యూబాకు 64 ఓట్లు రాగా థాపాకు 25 ఓట్లు మాత్రమే వచ్చాయని అధికారులు తెలిపారు. మొత్తం 80 మంది శాసనసభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. నవంబరు 20న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నేపాలీ కాంగ్రెస్ ఆవిర్భవించిన క్రమంలో తదుపరి ప్రభుత్వానికి డ్యూబా (76) నేతృత్వం వహించనున్నారు. ఈ పార్టీ 80 స్థానాలను గెలుచుకున్నది. ప్రతినిధుల సభకు ఎన్నికైన కొత్త సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పార్లమెంటరీ కార్యదర్శి వర్గాలు వెల్లడించాయి. మొత్తం 275 మంది సభ్యులు ఉంటే 165 మంది ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా 110 మంది దామాషా ఎన్నికల విధానం ద్వారా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ భూములు పంచాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

పోరాటం, రైతాంగ పోరాటాల్లో కమ్యూనిస్టులు క్రియాశీలకంగా నిలిచారని కొనియాడారు. ఆనాడు రాజ్యాంగ రూపకల్పన సమయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్... భూములను అందరికీ సమానంగా పంచాలని ప్రతిపాదించారని, ఇవాళ దానికి భిన్నంగా ప్రభుత్వాలు వ్యవహరించడంతోనే పేదలకు భూములు దక్కడం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో మావోయిస్టులతో కలిసి కీలకమైన చర్చలకు ఆహ్వానించగా, ఆ చర్చలు అసంతృప్తిగా ముగిశాయని గుర్తుచేశారు. ఆ తర్వాత తాను చర్చల సారాంశాన్ని అధికారి హోదాలో వైఎస్ఆర్‌ను అడిగి తెలుసుకోగా, అత్యధికంగా 95 శాతం భూ సమస్యల పరిష్కారంపైనే మావోయిస్టులు సూచించినట్లు తనకు వివరించారన్నారు. దాని పర్యవసానంగా కోనేరు రంగారావు సిఫార్సుల కమిటీ ఏర్పాటు చేశారని, 104 సిఫార్సులు వచ్చినట్లు తెలిపారు. అందులో 90 సిఫార్సులకు జీవోలు వచ్చినప్పటికీ, అవి కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమన్నారు. పేదల చేతుల్లోకి భూములు వచ్చినప్పుడే పేదరికం పోతుందని సూచించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన భూపోరాట సదస్సు స్ఫూర్తితో, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను నవరత్నాల్లో చేర్చాలనే దిశగా మరో పోరాటానికి సమాయాత్తం కావాలని, ప్రతి పేద కుటుంబానికి 2 ఎకరాల భూమి ఉండేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తీసుకొచ్చిన నూతన భూ సంస్కరణల చట్టాల తరహాగా, ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలయ్యే పరిస్థితులున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులకు కల్పించిన భూ హక్కు చట్టాలు నిర్వీర్యమవుతున్నాయన్నారు.

ఆత్మగౌరవం కోసం పోరాడాలి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, సదస్సుకు జిల్లాల నుంచి వచ్చిన వారంతా, ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను అధ్యయనం చేసి, వాటి పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించాలన్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నప్పటికీ... భూ సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. కేవలం భూమి, ఇసుక మీదే అధికార ప్రజాప్రతినిధులు దందా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములన్నీ అధికార నేతల అనుచరులు, బినామీ పేర్లతో అన్యాక్రాంతమవుతున్నాయని మండిపడ్డారు. భూమి ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, అలాంటప్పుడు భూములు పేదలకు దక్కాలంటే భూపోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. పేదల భూముల కోసం కేసులు, బెయిళ్లు కాదని, అవసరమైతే జైళ్లలోనే ఉంటామని తెలిపారు. జగన్ హయాంలో ఇప్పటివరకు కేవలం ఐదు ఇళ్లనే పూర్తి చేసినట్లు ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో వెల్లడైందన్నారు. జగనన్న కాలనీలకు గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు ఇవ్వాలని తాము డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో భూపోరాటాలతో పాటు ఆత్మగౌరవం కోసం పోరాడాలని కోరారు. దళిత సంక్షేమ పథకాల నిధులను అడ్డగోలుగా పక్కదారి పట్టించారన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను జగన్ ప్రభుత్వం సక్రమంగా అమలు చేస్తే, ఆయా వర్గాలకు అన్నీ దక్కుతాయని, సంతోషంగా ఉంటాయని సూచించారు. భూ పోరాట సదస్సుకు వివిధ జిల్లాల నుంచి వస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలను అకారణంగా పోలీసులు అడ్డగించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని ధ్వజమెత్తారు.

జల్లి విల్సన్ మాట్లాడుతూ భూ పోరాటం మన పేటెంట్ హక్కు అని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల అమలుపై ప్రభుత్వం స్పందించకుంటే ఇక ఉద్యమమేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ జనాభాలో 60 శాతం వ్యవసాయ కార్మికులే ఉన్నారని, వారిలో అత్యధికులు దళిత, గిరిజన, బలహీన వర్గాల వారేనని, వారంతా ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుకబడి ఉన్నారని తెలిపారు. ప్రతి ఏటా పేదల సంఖ్య పెరుగుతోందని, భూమి లేకుండా 59 శాతం మంది గ్రామీణులున్నారని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా భూమిలేని నిరుపేద కుటుంబానికి 3 ఎకరాల సాగు భూమి, 5 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వవచ్చని, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో నియమించిన కోనేరు రంగారావు భూ కమిటీ స్పష్టమైన నివేదిక ఇచ్చినప్పటికీ, వాటిని ఇప్పటివరకూ అమలు చేయలేదన్నారు. సాధించుకున్న చట్టాలు మాత్రం పేదవాడికి అనుకూలంగా ఉన్నప్పటికీ, సాగు భూములు మాత్రం వారికి దరిచేరడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ సదస్సులో ప్రధాన తీర్మానాలను ప్రవేశపెట్టారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో చేర్చి, గ్రామీణ పేదలకు భూ పంపిణీ వెంటనే చేపట్టాలని, దీర్ఘకాలంగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు, నివాసముంటున్న ప్రభుత్వ స్థలాలకు అన్ని హక్కులతో పట్టాలివ్వాలని, పేదలకు అన్యాయం చేసే అసైన్డ్ భూముల విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన 9/77 అసైన్డ్ చట్టంలోని అన్ని సవరణలు రద్దు చేయాలని, అటవీ హక్కుల చట్టాన్ని పక్కాగా అమలు చేయాలనే తీర్మానాలను సదస్సు ఆమోదించింది. తొలుత వేదిక పైకి ఎంపీటీసీ రాష్ట్ర సంఘం కార్యదర్శి ఆర్.వెంకట్రావ్ అతిథులను ఆహ్వానించారు. భూ పోరాట సదస్సులో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ రామాంజనేయులు, దళిత బహుజన ఫ్రంట్ నేత కొరివి వినయ్‌కుమార్ తదితరులు ప్రసంగిస్తూ, భవిష్యత్తులో వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టబోయే భూ పోరాటాలకు సంఘీభావం ప్రకటించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, వివిధ జిల్లాల సంఘం కార్యదర్శులు ఆనందరావు-విజయనగరం, పి.సుబ్రహ్మణ్యం, కాబోతు ఈశ్వరరావు-గుంటూరు, సిహెచ్.ప్రభాకర్-తిరుపతి, ఎం.నబీరసూల్-కర్నూలు, తోపు కిష్టప్ప-అన్నమయ్య, కె.రాధాకృష్ణ-నంద్యాల, కలిశెట్టి వెంకట్రావ్-పశ్చిమ గోదావరి, టి.రంగయ్య-అనంతపురము, అప్పలనాయుడు-శ్రీకాకుళం, ఎస్కే హుస్సేన్-పల్నాడు, శ్రీధర్-బాపట్ల, ఆకుల రామకృష్ణ-తూర్పు గోదావరి, గరుగుబిల్లి సూరయ్య-మన్యం తదితరులు వారి జిల్లాల్లోని భూ సమస్యలను, వాటి కోసం చేపట్టిన భూపోరాటాలను వివరించారు.

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చంద్రానాయక్, నాసర్ సామాజిక, అభ్యుదయ గీతాలను ఆలపించారు. సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు వందన సమర్పణ చేశారు.

సేద్యంలో ఏపీ ఆదర్శం

విత్తనాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ శేఖర్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వ్యవసాయ-ఆహార విధానాల్లో ఆంధ్రప్రదేశ్ సుస్థిరాభివృద్ధి సాధించి దేశంలో అగ్రగామిగా నిలవనుందని ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గెద్దం శేఖర్‌బాబు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ, ఆహార, వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏఓ) సహకారంతో బుధవారం విజయవాడ మురళీఫార్చ్యూన్ హోటల్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. 10,778 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనం, మంచిపంట విక్రయం వరకూ అన్ని రకాల సేవలను గడపవద్దకే అందిస్తోందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో చాలా విప్లవాత్మక సంస్కరణలను తెచ్చిందనీ, అన్ని గ్రామ పంచాయతీలకు ఆర్బీకేల ద్వారా సేవలు అందనున్నాయని చెప్పారు. ఇది దేశశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆహార, వ్యవసాయ సంస్థ భారత ప్రతినిధి డాక్టర్ చావా కొండారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగం ద్వారా ఆంధ్రప్రదేశ్ సానుకూల రాబడులు, అభివృద్ధి సాధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకులు ఎం.త్రివిక్రమ్‌రెడ్డి, ఆర్బీకే సంయుక్త సంచాలకులు వి.శ్రీధర్ తదితరులు మాట్లాడుతూ, పొలంబడి ద్వారా రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులతో వారికి సమగ్ర అవగాహన కల్పిస్తున్నామన్నారు. వర్క్‌షాప్‌లో వ్యవసాయ, ఉద్యాన, విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థల మాస్టర్ ట్రైనర్లతోపాటు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో పాటు ఎఫ్ఏఓ ప్రతినిధులు సుధాకర్, పచికేత్, పొలంబడి ఉప సంచాలకులు బాలు నాయక్, విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి: గులేరియా

న్యూఢిల్లీ: చైనా, అమెరికా సహా అనేక దేశాల్లో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో మరోమారు ప్రపంచ దేశాలు అప్రమత్తమయ్యాయి. కోవిడ్ నిరోధానికి చర్యలు తీసుకుంటున్నాయి. ప్రస్తుతానికి భారతదేశంలో కోవిడ్ కేసుల్లో పెరుగుదల లేదని ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా తెలిపారు. అలాగనీ నిర్లక్ష్యంగా ఉండవద్దని, అప్రమత్తంగా ఉంటే ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు అని ప్రజలకు హితవు పలికారు. 'కరోనా కేసులు పెరగట్లేదుగానీ అప్రమత్తంగా ఉండాలి. సరైన నిఘా ఉంటేనే ఎక్కడైనా కేసులు పెరిగితే వీలైనంత త్వరగా పరీక్షలు నిర్వహించి వైరస్‌ని నియంత్రించవచ్చు. కొత్త వేరియంట్లను గుర్తించి, వ్యాప్తిని కట్టడి చేయొచ్చు. చైనాతో పోలిస్తే మన దేశంలో పరిస్థితి మెరుగ్గానే ఉంది. వాక్సినేషన్ విజయవంతంగా అమలు జరిగింది. అధిక ముప్పు ఉన్నవారిలో చాలా వరకు బూస్టర్ డోసులను తీసుకున్నారు' అని గులేరియా అన్నారు.

జోడో యాత్ర ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

తప్పనిసరిగా పాటించేలా చూడాలని వారు కోరారు. మాస్కులు, శానిటైజర్లు ఉపయోగించాలని, వాక్సిన్ వేసుకున్నవారినే యాత్రకు అనుమతించాలని కోరారు. ఈ లేఖపై స్పందించిన మంత్రి మాండవీయ.. రాహుల్ గాంధీ, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్‌కు లేఖలు రాశారు. జోడో యాత్రలో కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఒకవేళ అలాంటి పరిస్థితి లేకపోతే దేశ ప్రయోజనాల దృష్ట్యా యాత్రను కొంతకాలం వాయిదా వేసుకోవాలని కోరారు.

బీజేపీకి భయం: కాంగ్రెస్

మంత్రి మాండవీయ లేఖపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఇటీవల గుజరాత్ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ భారీ రోడ్ షోను ప్రస్తావిస్తూ జోడో యాత్రతో రాహుల్ గాంధీకి సోషల్‌మీడియాలో భారీ ఆదరణ లభిస్తోందని, దీన్ని చూసి బీజేపీ భయపడుతోందని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు. తమ పార్టీకి ప్రజల నుంచి వస్తోన్న స్పందనను తట్టుకోలేకనే మోదీ సర్కారు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నట్లు విమర్శించారు. గుజరాత్‌లో ఓట్లు అభ్యర్థించడానికి వెళ్లినప్పుడు మోదీ మాస్క్ పెట్టుకున్నారా అని కేంద్రాన్ని ప్రశ్నించారు.

చదువుతో అసమానతలకు చెక్

(మొదటిపేజీ తరువాయి)

పాలనలో పెత్తందారీ భావాలను బద్దలుకొడుతూ రాష్ట్రంలోని స్కూళ్లలో డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. తన పుట్టిన రోజు నాడు తనకెంతో ఇష్టమైన చిన్నారుల భవిష్యత్ కోసం ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టడం తన అదృష్టమన్నారు. ఓదార్పు యాత్ర నుంచి పాదయాత్ర వరకు తన రాజకీయ ప్రయాణంలోఎంతోమంది తల్లుల బాధ తనను కలచివేసిందనీ, బతుకులు మారాలంటే, తలరాతలు మారాలని, చదువు అనే ఒకే ఒక్క ఆస్తిద్వారానే తలరాత మారుతుందనే తపన, ఆరాటం ప్రతి తల్లితండ్రిలో కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ బడిలోనూ, ఎయిడెడ్ స్కూల్‌లోనూ చదువుకుంటూ మామూలుగా పలకలమీద అక్షరాలు దిద్దిన నిరుపేద కుటుంబాలకు చెందిన 8వ తరగతి పిల్లల చేతుల్లో డిజిటల్ ట్యాబులు ఉంచబోతున్నామన్నారు. పిల్లలందరూ ఆ ట్యాబులు క్లాస్‌రూములో చూపిస్తున్నప్పుడు పిల్లలకు జరుగుతున్న మంచి చూసినప్పుడు చాలా సంతోషం అనిపించిందన్నారు. ఇంగ్లీషు మీడియం చదవకూడదని ఏకంగా కోర్టులకు వెళ్లి కేసులు వేసే దౌర్భాగ్య పరిస్థితిలో ఈ రాష్ట్రం ఉందన్నారు. పలకల చదువులతోనే కొన్ని కులాల విద్యాభ్యాసం ముగిసిపోయి, కొన్ని వర్గాలకు మాత్రమే ట్యాబులు, డిజిటల్ విద్య, ఇంగ్లీషు మీడియం అందుబాటులో ఉన్న సమాజాన్ని మనం ఆమోదించవచ్చా అని అందరం ప్రశ్నించుకోవాల్సిన అవసరం నేటి రాజకీయ వ్యవస్థలో ఉందన్నారు. ఇటువంటి వ్యవస్థను మార్చే తిరుగుబాటులో నేను మీ వాడిగా, మీలో ఒకడిగా, మీ బిడ్డగా, మీ మేనమామాగా, ఆ ప్రతి తల్లికీ అన్నగా మీకోసం నేనున్నానని, తోడుగా ఉంటానని జగన్ స్పష్టం చేశారు. ట్యాబ్‌ల్లో 8,9వ తరగతులకు సంబంధించి పాఠాలు లోడ్‌చేసి ఇస్తున్నామని ఇంటర్నెట్ లేకపోయినా ఆఫ్‌లైన్‌లో కూడా పాఠాలు వినే అవకాశం ఉంటుందన్నారు. ట్యాబులో సెక్యూర్డు మొబైల్ డివైజ్ మేనేజిమెంట్ (ఎండీఎం) సాఫ్ట్‌వేర్ పెట్టామని ట్యాబుల్లో పాఠాలు, లెర్నింగ్‌కు సంబంధించిన అంశాలు మాత్రమే చూడగలుగుతారని పిల్లలకు నష్టం కలిగించే కంటెంట్‌ను మీ మేనమామ కత్తిరిస్తున్నాడని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి పై తరగతి వరకూ ప్రతి సెక్షన్‌లోనూ డిజిటల్ క్లాస్‌రూమ్స్ కాబోతున్నాయన్నారు. నాడు నేడు కింద మొదటిదశలో పనులు పూర్తిచేసుకున్న 15,715 స్కూళ్లల్లో 6 తరగతి నుంచి ఆ పై తరగతి ఉన్న 32,213 క్లాస్‌రూంలకు ఐఎఫ్‌పిలు పెట్టి డిజిటల్ క్లాస్‌రూములుగా మార్చబోతున్నామని వచ్చే జూన్‌కల్లా పూర్తవుతుందని తెలిపారు. రాష్ట్ర మొత్తమ్మీద దాదాపు 45వేల స్కూళ్లు ఉంటే ఈ జూన్ నాటికల్లా తొలిదశలో 15,715 స్కూళ్లలో డిజిటల్ క్లాస్‌రూమ్స్ కాబోతున్నాయన్నారు. మూడున్నర సంవత్సరాలుగా ఎన్నో ముందడుగులు వేశామని గతానికి భిన్నంగా నేడు బడులు ప్రారంభమయ్యే తొలిరోజునే విద్యా కానుక కిట్ ఇస్తున్నామన్నారు. స్కూల్ బ్యాగుతో పాటు బైలింగువల్ టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్, షూస్, 3 జతల యూనిఫాం, సాక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీతో కలిపి విద్యాకానుక కిట్‌గా ఇస్తామన్నారు. విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టామని నాడు నేడు, ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ, డిజిటల్ క్లాస్ రూములు, ట్యాబులు, బైజూస్ కంటెంట్,అమ్మఒడి, గోరుముద్దతో సహా అనేక పథకాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పెద్ద చదువులు చదువుతున్న పిల్లలకు విద్యాదీవెన, వసతి దీవెన కింద ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి, తల్లులు కాలేజీలకు పంపిస్తే చాలు చదివించే బాధ్యత నాది అని హామీ ఇస్తున్నానన్నారు. 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యాదీవెన కింద ఇస్తున్నామని పిల్లల బోర్డింగ్, మెస్ ఖర్చుల కోసం కూడా తల్లిదండ్రులు ఇబ్బంది పడకుండా రూ.20 వేలు పిల్లలకు ఏడాదికి రెండు దఫాలుగా ఇస్తూ తోడుగా ఉండే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇవన్నీ ఒక్కసారి ఆలోచన చేయమని పిల్లలను తల్లిదండ్రులను వేడుకుంటున్నానన్నారు.

రూ.2500కోట్లతో కృష్ణాదిపై బ్యారేజీ

(మొదటిపేజీ తరువాయి)

మండలాల్లో 10 గ్రామాల్లో 3749 రైతులకు సంబంధించిన లంక భూములకు వారికి పట్టాలు ఇప్పించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఏవీఆర్ జడ్పీ హైస్కూల్‌లో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు కూడా యాడ్ చేసేందుకు హామీ ఇస్తున్నానన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. మంత్రి మేరుగ కుటుంబీకులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని జగన్‌కు బహుకరించి ఘనంగా సన్మానించారు.

అస్త్రం కాదు

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించరాదని తెలిపింది. 'ఫిర్యాదు దశలో పూర్తిస్థాయి దర్యాప్తును కోర్టు ఆశించదు.కానీ నిందితులను దీర్ఘకాలం విచారణ పేరిట ఇబ్బందిపెట్టడం సమంజసం కాదు. దర్యాప్తు అధికారుల నుంచి కొద్దిపాటి ఆధారాలనే కోర్టు ఆశించడం సముచితంగా ఉంటుంది' అని జస్టిస్ కృష్ణ మురారీ, జస్టిస్ ఎస్.రవీంద్ర భట్ ధర్మాసనం పేర్కొంది.

వేడుకగా సీఎం జగన్ పుట్టినరోజు

- కేక్ కట్ చేయించిన మంత్రులు, అధికారులు
- శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ దంపతులు
- రాష్ట్రవ్యాప్తంగా రక్త, అన్నదాన, సేవా కార్యక్రమాలు
- ఏపీ భవన్‌లో కేక్ కోసిన ఎంపీలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వేడుకగా నిర్వహించారు. తాడేపల్లి సీఎం జగన్ నివాసంలో ఏర్పాటు చేసిన కేక్‌ను, సీఎంతో మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు కట్ చేయించారు. ఫోన్‌లో సీఎంకు రాష్ట్ర గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్ దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు ఆశీర్వాదం అందించారు. పాస్టర్ జాన్ వెస్లీ అధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సీఎంకు వైఎస్ విజయలక్ష్మీ, వైఎస్ భారతి శుభాకాంక్షలు తెలిపారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాదాలు అందించారు. సీఎంను డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తానేటి వనిత, ఆర్కే రోజా, విడదల రజని, జోగి రమేష్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, బాలశౌరి, ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకరరావు, మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, సీఎం ప్రిన్సిపల్ అడ్వైజర్ అజేయ కల్లాం, ముఖ్యమంత్రి స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా, సమాచారశాఖ కమిషనర్ టి విజయకుమార్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శి కె.ధనుంజయ రెడ్డి, అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు, సంయుక్త కార్యదర్శి నారాయణ భరత్ గుప్తా, సీఎం ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ ఇరగవరపు అవినాశ్, సీఎం స్పెషల్ సెక్రటరీ దువ్వూరి కృష్ణ, ఎం.హరికృష్ణ, సీఎం సలహాదారులు ఆర్.ధనంజయరెడ్డి, సీఎం సీపీఆర్వో పూడి శ్రీహరి, ప్రజా ప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

కేక్ కటింగ్‌లు, సేవా కార్యక్రమాలు

సీఎం జగన్ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేయడంతోపాటు, పుస్తకాలు, దుస్తుల పంపిణీ, రక్తదానం, మొక్కలు నాటడం, అన్నదాన తదితర సేవా కార్యక్రమాల్ని నిర్వహించారు. జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని 8వ తరగతి విద్యార్థులకు 5 లక్షలకు పైగా ట్యాబులు పంపిణీ చేయ డంతో విద్యార్థుల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. 'థ్యాంక్యూ జగన్ మామ..'అంటూ రాష్ట్రంలోని ఆయా ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యార్థులు ట్యాబులు చూపిస్తూ, ప్లకార్డులు పట్టుకుని శుభాకాంక్షలు తెలిపారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా అన్ని జిల్లాల్లోనూ ఎటు చూసినా వైసీపీ జెండాలు, బ్యానర్లు, ఫెక్సీలతో నిండిపోయింది. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో జగన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసీపీ జెండా రంగులను పోలిన బెలూన్లను ఆకాశంలోకి ఎగురవేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతలు ఏదైతే కోరుకున్నారో అలాంటి లక్షణాలు ఉన్న నేత జగన్ అని అన్నారు. మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ జగన్‌కు నేడు తెలుగు ప్రజలందరూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతు న్నారన్నారు. తెలుగు అకాడమి ఛైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జగన్ పుట్టినరోజు రక్తదాన శిబిరం, అన్నదానం, వస్త్రాల పంపిణీ చేపట్టారు. పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు.

ఏపీ భవన్‌లో జగన్ పుట్టిన రోజు

ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఎంపీ వి.విజయసాయిరెడ్డి అధ్వర్యంలో వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహిం చారు. వైసీపీ ఎంపీలతో పాటు ఏపీ భవన్ ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి జగన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. వైసీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డి, భరత్, వంగా గీతా, తలారి రంగయ్య, రెడ్డప్ప, మాధవ్, గురుమూర్తి, సంజీవ్, లావు కృష్ణదేవరాయులు, శ్రీధర్, ఆర్.కృష్ణయ్య, ఏపీ భవన్ ఉద్యోగులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తుపానువల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: డేగా ప్రభాకర్

విశాలాంధ్ర–ఏలూరు: మాండస్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవా లని రైతు సంఘం రాష్ట్ర నాయ కులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదపాడు మండలం, వట్లూరు నుంచి పెదపాడు వెళ్లే రహదారిలో రోడ్లపై ఆరబోసిన ధాన్యపు రాశులను రైతు సంఘం ప్రతినిధులు పరిశీలించారు. ఇటీవల వచ్చిన మాండస్ తుపాను ప్రభావంతో రైతాంగం పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఎటువంటి ధాన్యానైనా ఏ స్థితిలో ఉన్నా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందని ప్రకటన ఇచ్చారని, ఆచరణలో మాత్రం ప్రభుత్వ యంత్రాంగం అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆర్బీకే సాంకేతిక నిపుణులు, రైస్ మిల్లర్ల మధ్య 3 నుండి 4 వరకు తేమ శాతంలో తేడాలు వస్తున్నాయని దీనిని అవకాశంగా తీసుకుని రైసు మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నారన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన పౌరసరఫరాల శాఖ మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతాంగానికి ఎకరా రూ.25 వేల నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం, సీపీఐ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ ప్రతినిధి బృందంలో సీపీఐ నాయకులు రెడ్డి రఘు, రైతు సంఘం నాయకులు పసుపులేటి సత్యనారాయణ, పి రంగారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడిగా మసేన్

విశాలాంధ్ర–విశాఖ: కేరళలో డిసెంబర్ 16 నుంచి 20 వరకు జరిగిన ఏఐటీయూసీ 42వ జాతీయ మహాసభల్లో, జాతీయ సమితి సభ్యుడిగా విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి బీసీహెచ్. మసేన్ ఎన్నికయ్యారు. ఈ మేరకు యూనియన్ నాయకులు మసేన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జాతీయ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి వరసగా మూడోసారి జాతీయ సమితిలో చోటు కల్పించారని పేర్కొంటూ కార్మిక హక్కుల పరిరక్షణకు ఏఐటీయూసీ తరపున అలుపెరుగని పోరాటం చేస్తానని మసేన్ ఈ సందర్భంగా తెలిపారు. కార్మిక హక్కులు, ఉద్యోగాలు నేడు ప్రమాదంలో పడ్డాయని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి దీనికి ప్రధాన కారణమని, కార్పొరేట్ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కరోనాపై ప్రభుత్వం అప్రమత్తం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కరోనాపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందనీ, నిరంతరం పర్యవేక్షిస్తోందని ఆరోగ్య,, కుటుంబ, సంక్షేమశాఖ కమిషనర్ జే నివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో చైనా నుంచి వచ్చిన కొత్త వేరియంట్ కేసులు వెలుగు చూసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం అప్రమత్తం చేసిందన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఆక్సిజన్, ఐసీయూ బెడ్లను సిద్ధంగా ఉంచామనీ, ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు, మందులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లలో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. నవంబరు నుంచి దాదాపు 30వేల శాంపిళ్లను పరీక్షించగా, 130 పాజిటివ్ కేసులు వచ్చాయన్నారు. అవన్నీ ఒమిక్రాన్ తప్ప, కొత్త వేరియంట్ లేదని స్పష్టం చేశారు. జీనోమ్ స్వీక్వెన్సింగ్ టెస్ట్‌లకు ఏర్పాటు చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 29 ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

లేబర్‌కోడ్‌ల అమలు పేరుతో కార్మికులు, ఉద్యోగులపై కక్ష సాధింపు

సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, గఫూర్

విశాలాంధ్ర–విజయవాడ: లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికులు, ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం వంతపాడుతోందని, నిరసనలు, ఆందోళనలు కనిపించ కూడదనే విధంగా వ్యవహరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమవు తున్నారని, దీనికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. బుధవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ నాయ కత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూపొందించిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేయడంలో వైసీపీ ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే వేగంగా ముందుకు వెళుతోందని తెలిపారు. ఉద్యోగుల, కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా శాంతి యుతంగా పోరులు తమ నిరసనలను తెలిపే హక్కును రాజ్యాంగం ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని విధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇటీవల బహిరంగ సభలే కాకుండా ఇన్‌డోర్ సమావేశాలను కూడా పోలీసులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఒక హాలులో సమావేశమై తమ సమస్యల గురించి చర్చించుకోవడం ఏ విధంగా చట్టవిరుద్ధమవుతుందో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై తక్షణం స్పందించాలని, నిర్బంధాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేయడం తీవ్రమైన కార్మిక వ్యతిరేక చర్యని అన్నారు. పారిశ్రామిక యాజమాన్యానికి తోడ్పడేందుకు, కార్మికుల మౌలిక హక్కులను కుదించే పద్ధతిలో ఈ కోడ్‌లు రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిని అమలు చేయాలనుకోవడం కార్మికుల వ్యతిరేక చర్యని వివరించారు. కాగా ఎనిమిదో తరగతి నుంచి విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ట్యాబ్‌ల్లో బైజూస్ కంటెంట్ పెట్టి ఇస్తున్నారని, వందల కోట్ల రూపాయల అమ్మఒడి నిధులను బైజూస్‌కు కట్టబెట్టడం సరికాదని, దీనిని రద్దు చేసి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వబోమని కేంద్రం చెబుతున్నా రాష్ట్రం కనీసం నోరెత్తడం లేదని, పోలవరం నిర్వాసి తులకు ఇంతవరకు న్యాయం జరగలేదని అన్నారు. వేల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన టిడ్కో ఇళ్లు ధ్వంసం అవుతున్నాయని, ఈ ఇళ్లకు లబ్ధిదారులే బ్యాంకులకు ఇప్పటికీ రుణాలు కడుతున్నారని, అయినా ప్రభుత్వం వాటిని పంపిణీ చేయకపోవడంతో అవి దెబ్బతిన్నాయని తెలిపారు. రాయలసీమ జిల్లాల్లో అన్నమయ్య ప్రాజెక్టు దెబ్బతింటే ఇంతవరకు గేట్లు పెట్టలేదని, పైగా ప్రాజెక్టుల్లో గట్ల మట్టిని అక్రమార్కులు దోచుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై విచారణ జరిపించాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నా రైతులకు డబ్బులు చెల్లించకుండా బకాయిలు పెడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో లక్షల కోట్లు అప్పులు చేస్తున్నా ఎక్కడా ఉపాధి కల్పించే పరిశ్రమలు రాలేదని ధ్వజమెత్తారు.

మహిళలు సంఘటితం కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథ రెడ్డి

మహిళా సమాఖ్య రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర–తిరుపతి: మహిళా చైతన్యంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఇందుకు మహిళలు సంఘటితం కావలసిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా మహిళ సమాఖ్య అధ్వర్యంలో బుధవారం స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, రమణ, టి.జనార్ధన్ మహిళలకు బోధన చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి తరగతులను ప్రారంభించిన హరినాథ రెడ్డి మాట్లాడుతూ మహిళలు దేశంలోని వివిధ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జాతీయ, రాష్ట్ర సమితులు మహిళలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. తెలంగాణ పోరాటంలో చాకలి ఐలమ్మ నిజాం రజాకారులను ధైర్యంగా ఎదుర్కొని పోరాటానికి నాంది పలికిందని, అలాగే ఝాన్సీ లక్ష్మీబాయి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబావుట ఎగురవేసిందని ఉదహరించారు. మహిళలు తమ హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్యాస్ సిలిండర్, నిత్యావసరాల ధరల స్థిరీకరణకు, అత్యాచార దాడులను అరికట్టడానికి మహిళలు పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో రక్తహీనతతో బాధపడుతున్న మహిళలలో 35 శాతం మంది తిండి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాంటి వారికి ప్రభుత్వం చేదోడువాదోడుగా నిలవాలని, ఎర్ర చందనం స్మగ్లింగ్ ముఠాలకు కాదని అన్నారు. 75 వసంతాల భారతావనిలో రోడ్లు, భవనాలు, విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తే... అభివృద్ధి చెందినట్లు కాదని, దేశ ప్రజలందరూ సంక్షేమంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధించినట్లని ఆయన వివరించారు. కమ్యూనిస్టు

పార్టీ మహిళలు, కార్మికులు, విద్యార్థులు, యువతను చైతన్యవంతులను చేస్తుందని నొక్కి చెప్పారు. మహిళలు ఈ శిక్షణా తరగతులను పూర్తిగా వినియోగించుకొని చైతన్యవంతులై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెంచమ్మ, నదియా, మంజుల, రత్నమ్మ, హరిత, ప్రమీల, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీలు నెరవేర్చలేదు

- వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య

విశాలాంధ్ర–రాయచోటి టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా రాష్ట్ర ప్రజలకు హామీలు ఇచ్చి మూడు సంవత్సరాలవుతున్నా నేటికీ అమలు చేయడంలో విఫలం చెందారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. బుధవారం రాయచోటి పట్టణంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వామపక్ష నాయకులను, విద్యార్థి, యువజన సంఘాల నాయకులను రెండు రోజుల ముందే అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అతివృష్టి, అనావృష్టితో ఇబ్బంది పడుతున్న రైతాంగం మరోపక్కన నకిలీ విత్తనాలు, ఎరువుల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారని, నకిలీ విత్తనాలు తయారీదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు గడప గడపకు కాకుండా పొలం బాట పట్టి రైతుల ఇబ్బందులు తెలుసుకొని రైతాంగానికి అండగా ఉండాలన్నారు. డిసెంబర్ 27న రైతాంగ సమస్యలపై ముఖ్యమంత్రి నివాసం ముందు పంచాయతీ పెడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో చేపట్టిన గర్జన విభజన హామీలు అమలు చేయాలని ఢిల్లీలో గర్జన పెట్టాలని కోరారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కడపలో స్టీల్ ప్లాంట్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని, మదనపల్లిలో టమాటా ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాటాలు సాగిస్తామన్నారు. సాగు, తాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇంటి, నీటి, చెత్త పన్నులు, ఇతర అన్ని రకాల ధరలను విపరీతంగా పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. ప్రజలకు వందల్లో ఇచ్చి వేల రూపాయలు దండుకుంటున్నారన్నారు.

గాలివీడులో ప్రభుత్వ భూముల ఆక్రమణపై విచారణ చేపట్టాలి

గాలివీడు మండలంలోని గోరాన్ చెరువు గ్రామ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై సమగ్ర విచారణ చేపట్టాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గాలివీడు మండలంలోని ప్రభుత్వ భూములను అక్రమార్కులకు కట్టబెడుతూ, అక్రమ లేఅవుట్ల ఏర్పాటుకు సహకరిస్తూ, మట్టి మాఫియాతో చేతులు కలిపిన అవినీతి వీఆర్వో రవీంద్రారెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. మండలపరిధిలో సహజ సిద్ధంగా ఏర్పడిన గుర్రాలమిట్ట, పేరాల గుట్టలను మట్టి మాఫియా ఇష్టానుసారంగా తవ్వేస్తుంటే ప్రేక్షకపాత్ర వహిస్తున్న రెవెన్యూ యంత్రాంగం తీరుపై మండిపడ్డారు. చెరువులు, వాగులు, వంకలు ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్న సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా నిరుపేదలకు పంచిపెట్టాలన్నారు. మండలంలో జరుగుతున్న అవినీతిపై ప్రశ్నించిన సీపీఐ మండల కార్యదర్శి నచ్చు భాస్కర్‌ను దుర్భాషలాడిన వీఆర్వో రవీంద్రారెడ్డిపై తక్షణమే జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు సాంబశివ, కోటేశ్వరరావు, సుధీర్, సుమిత్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు లవ కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, గాలివీడు సీపీఐ మండల కార్యదర్శి భాస్కర్ యాదవ్, అంజనేయులు, యువజన విద్యార్థి సంఘ నాయకులు జక్కల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్): 'స్వభాషను పరిరక్షించుకుందాం–స్వాభిమానాన్ని పెంచుకుందాం' అనే నినాదంతో కృష్ణాజిల్లా తెలుగు రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), తానా ప్రపంచ సాహిత్య వేదిక సిద్ధార్థ అకాడమి (విజయవాడ) సౌజన్యంతో ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్వర్యంలో ఈ నెల 23, 24 (శుక్ర, శని) తేదీలల్లో 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహి స్తున్నట్లు ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర శాసన సభ మాజీ ఉప సభాపతి డా॥మండలి బుద్ధ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డా.జి.వి. పూర్ణచంద్, అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ నలుమూలల నుంచి 1500 మంది రచయితలు ఈ మహాసభల్లో పాల్గొనబోతున్నారని పేర్కొన్నారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, చరిత్ర రంగాలపై వాణిజ్య సంస్కృతి ప్రభావం బాగా కనిపిస్తోందన్నారు. సామాజిక విలువలను కాపాడుతూ, భాష, సంస్కృతి, దేశీయ కళలు, సాహిత్యం, చరిత్రల అధ్యయనాల ద్వారా సామాజిక చేతనత్వాన్ని కలిగించటానికి ప్రపంచ తెలుగు రచయితల సంఘం 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తోందని వివరించారు. ప్రపంచం నలుమూలల నుంచి దాదాపు 1500 మంది రచయితలు, భాషాభిమానులు ప్రతినిధులుగా హాజరవుతున్నారని వివరించారు. మొత్తం 30 సదస్సుల్లో దేశ, విదేశాల నుంచి 800 మంది ప్రతినిధులు పాల్గొం టున్నారన్నారు. 23 ఉదయం 10 గంటలకు భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు మహాసభలను ప్రారంభిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు తెలుగు వెలుగుల సభలో భారత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొంటున్నారని తెలిపారు. పద్మశ్రీ గ్రహీతలు ఆచార్య కొలకలూరి ఇనాక్, అన్నవరపు రామస్వామి, దండమూడి సుమతీ రామమోహనరావు, డా.గరికపాటి నరసింహారావు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి, సినీనటుడు సాయికుమార్, గేయ రచయితలు అందెశ్రీ, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, భువనచంద్ర, సంగీతవేత్త స్వరవీణాపాణి పాల్గొంటున్నారన్నారు. యువ అవధానులతో "కుదురాట–కొత్తవెలుగు", 10 మంది యువ గజల్ కవుల ముషాయిరా, 50 మందితో యువకవి సమ్మేళనం, 150 మందితో మహిళా కవిసమ్మేళనం, మోదుమూడి సుధాకర్, డా॥ సప్పా దుర్గాప్రసాద్, సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డా.ఎస్.పి.భారతి సోదాహరణ ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. కళారత్న కె.వి.సత్యనారాయణ బృందం ఆముక్తమాల్యద నృత్యరూపక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ. మాతృభాష పరిరక్షణకు ప్రజాచైతన్యం కలిగించటానికి రచయితల పాత్రపై వివిధ సదస్సుల్లో చర్చలు జరుగనున్నాయని వివరించారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డా.జంపా కృష్ణ కిశోర్, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు మాట్లాడుతూ మారుతున్న సామాజిక పరిస్థితుల్లో రచయితల పాత్ర, ఉపాధ్యాయులు–భాషాపరిరక్షణ, తెలుగు బోధన, సామాజిక మార్పులు–తెలుగు కవిత, విమర్శ, చరిత్ర, అంతర్జాలంలో తెలుగు విదేశీ, మహిళా పాత్రికేయ సదస్సు రాష్ట్రేతర తెలుగు ప్రముఖులతో సదస్సులు ఉంటాయని వివరించారు. ప్రతినిధులకు రెండు రోజులు కమ్మని తెలుగు విందు ఏర్పాట్లు చేశామన్నారు. 100కి పైగా రచయితలు తమ గ్రంథాలను ఈ సభల్లో ఆవిష్కరించనున్నారని నిర్వాహకులు వివరించారు. శుభోధయం యూట్యూబ్ ఛానల్ ద్వారా లైవ్, ప్రపంచ మహాసభలు పేరుతో వాట్సాప్ గ్రూపు ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ వెల్లడి చేస్తామన్నారు

ప్రత్యామ్నాయ ప్లాస్టిక్ బ్యానర్లకు సహకారం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ప్రత్యామ్నాయ ప్లాస్టిక్ బ్యానర్లకు ప్రభుత్వపరంగా అవసరమైన సహకారం అందజేస్తామని అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక శాఖ ముఖ్యకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీజేసిన ఉత్తర్వులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్లాస్టిక్ బ్యానర్ల అంశంపై బుధవారం విజయవాడ శేషసాయి కల్యాణ వేదికలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అవగాహన సదస్సు నిర్వహించింది. యంత్రాలకు సంబంధించి కలిగే ఇబ్బందులు, అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వినియోగించడం వల్ల పర్యావరణానికి, మానవాళి మనుగడలకు కలిగే నష్టం పెద్ద స్థాయిలో ఉందని వివరించారు. ప్రజలంతా స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఇంజినీర్ ఎం.శివారెడ్డి, అధికారులు సీహెచ్. కృష్ణమూర్తి, ఇంజినీర్ ఈ.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫుడ్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

ఒకరి గల్లంతు – ఇద్దరి పరిస్థితి విషమం

ఘటనా స్థలానికి మంత్రి కారుమూరి

విశాలాంధ్ర – తాడేపల్లిగూడెం రూరల్: పశ్చిమ గోదావరి జిల్లాలోని పరిశ్రమలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడగా ఒకరి ఆచూకీ లేదు. బుధవారం మధ్యాహ్నం పెంటపాడు మండలం, ప్రత్తిపాడులోని ఫుడ్ ఫ్యాట్స్ ఫ్యాక్టరీలో నూనె తయారు చేసే ఎస్ఎఫ్–1 విభాగంలో ఒక్కసారిగా పేలుడు సంభవించి మంటలు వ్యాపించాయి. దీంతో విధుల్లో ఉన్న కార్మికులంతా బయటకు పరుగులు తీశారు. మొత్తం తొమ్మిది మంది పనిచేయగా టీ విరామం కావడంతో కొందరు టీ తాగేందుకు వెళితే మిగతా వారు అక్కడే ఉన్నారు. దీంతో మంటల్లో చిక్కుకున్న కార్మికులను తోటివారు బయటకు తీయగలిగారు. వారందరికి గాయాలు కాగా చరణ్, ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రాజమండ్రికి తరలించారు. చిన్న గాయాలైన వారు తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. అయితేమల్లికార్జునరావు ఆచూకి లభ్యం కాలేదు. ఆయన ప్రాణాలు కోల్పోయి ఉంటారని తోటివారు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలోనూ అనేకసార్లు చిన్న ప్రమాదాలు జరిగినా యాజమాన్యం, అధికారులు పట్టించుకోలేదని కార్మికులు తెలిపారు. ఇటువంటి భయానక పరిస్థితి ఎన్నడూ చూడలేదన్నారు. ప్రమాదస్థలికి 2 కిలోమీటర్ల వరకు పేలుడు శబ్దం వినిపించినట్లు స్థానికులు తెలిపారు. ఫ్యాక్టరీలో మంటలు ఎగిసిపడటం చూసి చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఘటనాస్థలానికి వెళ్లి పరిస్థితులను సమీక్షించారు. ప్రమాదం విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. జిల్లా ఎస్పీ రవిప్రకాశ్, ఆర్డీఓ దాసిరాజు ప్రమాద స్థలిని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ లేని మల్లికార్జునరావు కుంచనపల్లి గ్రామానికి చెందినవారని, ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. ఆయన గురించి తోటి కార్మికుల నుంచి సమాచారం సేకరించినట్లు వెల్లడించారు. కాగా, ఫ్యాక్టరీ వద్ద కుంచనపల్లి గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు.

కోవిడ్ మళ్లీ విజృంభించనున్నదా?

చైనాను కల్లోల పరుస్తున్న కోవిడ్-19 మహమ్మారి మరోసారి ప్రపంచాన్ని వణికిస్తుందా? చైనాలో విజృంభించిన కోవిడ్ మహమ్మారి అవుననే సూచిస్తోంది. 2020లో చైనాలో తలెత్తిన ఈ వైరస్ ప్రపంచ మంతటా వ్యాపించింది. ఈ సారి కూడా ప్రపంచవ్యాప్తంగా అంటువ్యాధివలె విజృంభించే అవకాశం ఉందని మహమ్మారి అధ్యయన నిపుణులు తెలియజేస్తున్నారు. చైనాలో 60శాతం జనాభాకు, ప్రపంచంలో 10శాతం జనాభాకు ఈ వైరస్ విస్తరించే అవకాశం ఉందని అంటు వ్యాధుల నిపుణులు వెల్లడించారు. కొత్తగా విస్తరిస్తున్న ఈ మహమ్మారి మరోసారి ప్రపంచాన్ని కల్లోలపరుస్తుందని భారతదేశంకూడా ఇందుకు మినహాయింపు ఏమీకాదని వారు హెచ్చరిస్తున్నారు. ఇటీవల అకస్మికంగా కొత్తగా ఇన్‌ఫెక్షన్లు చైనాను చుట్టుముట్టాయి. ఈ వైరస్ జపాన్,దక్షిణ కొరియా, బ్రెజిల్,అమెరికా తదితర దేశాల్లోనూ ప్రజలకు సోకినట్లు గుర్తించారు. మొదట ఊహాన్ నగరంలో తలెత్తిన వైరస్ విస్తరణపై ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి ముందుగానే హెచ్చరించినప్పటికీ మన దేశంలో మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రధాని మోదీ ప్రజలకు హాని కలిగించే వ్యవసాయ చట్టాలను పార్లమెంటు ద్వారా ఆమోదింపచేసుకోవడం, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కి ఘనసత్కారం చేయడంలోనూ మునిగిపోయిన విషయం తెలిసిందే. ఈ సారైనా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సాంక్రమిక వ్యాధుల నిపుణులు కోరుతున్నారు. ఈ మహమ్మారి ప్రవేశించకుండా ముందుగానే కట్టుదిట్టమైన చర్యలు మోదీ ప్రభుత్వం తీసుకోవాలి. పర్యవేక్షణ, వైరస్ సోకినవారికి అవసరమైన వైద్యచికిత్సకోసం ఆస్పత్రులు సిద్ధంగా ఉంచడం, వ్యాక్సిన్‌లు సిద్ధం చేసుకోవడం లాంటి చర్యలను తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి విజృంభించకుండా అదుపుచేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

చైనాను సంక్షోభంలోకి దింపిన కోవిడ్ ప్రపంచ వ్యాప్తంగా సరఫరాలకు తీవ్ర అంతరాయం కలగవచ్చు. వ్యాధి వల్ల భారతదేశంలో అనేక పరిశ్రమల ఉత్పత్తి నిలిచిపోవడం లేదా తగ్గిపోవడం జరుగుతుంది. ఆరోగ్యరంగానికి సంబంధించిన ఉత్పత్తులు సైతం పరిమితంకావచ్చు. గతంలో వలెనే కాకపోయినా గణనీయంగానే ఉద్యోగ అవకాశాలు మరింత దెబ్బతినవచ్చు. కోవిడ్‌పై చైనా ప్రభుత్వం విధించిన ఆంక్షలను ధిక్కరించి తమకు స్వేచ్ఛగా తిరిగేందుకు అవకాశం ఇవ్వాలని ఆందోళన చేసినవారు ప్రస్తుతం వ్యాధి నిర్ధారణ పరీక్షలకు, ఔషధాలు, వాక్సిన్‌ల కోసం బైటకురాకుండా ఆన్‌లైన్ ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే 80కోట్ల మందికి వైరస్ సోకినట్లు అంచనా. మృతుల సంఖ్య కూడా భారీగానే ఉండవచ్చు. 2023 ప్రారంభంనాటికే 10లక్షలు లేదా ఆపైన మృతుల సంఖ్య ఉండవచ్చునని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆహార వస్తువులు, చలికి, ఆరోగ్యానికి అవసరమైన దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోలుకు చైనా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోవిడ్ విజృంభణను మీడియాసైతం పెద్దగా పట్టించు కోవడం లేదు. చైనా అనుభవం పొరుగునేఉన్న మనకు తీవ్రమైన హెచ్చరికే అవుతుంది. మన దేశంలో 90శాతం మందికి రెండు వ్యాక్సిన్‌లు వేసామని, దాదాపు 50శాతం మంది మూడవ డోసును కూడా తీసుకున్నారని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు వ్యాక్సిన్‌లు తీసుకున్నవారిలో 60ఏళ్ల ఆపైన ఉన్న వృద్ధులు ఎక్కువగా ఉన్నారు. 69శాతం మంది బూస్టర్ డోసు తీసుకున్నారు. అయినప్పటికీ కొత్తగా వచ్చిన వైరస్ విస్తరించినట్లయితే ఇంతవరకు తీసుకున్న వ్యాక్సిన్‌లు నూతన వైరస్‌ను అదుపుచేయలేకపోవచ్చు. చైనాలో శ్మశానవాటికలు, క్రిమిటోరియమ్స్ శవాలతో నిండిపోతున్నాయని వార్తలు వస్తున్నాయి. అంతేకాదు..కొత్తరకం వైరస్‌లు పుట్టే అవకాశం కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు. కొత్త రకం ఒమిక్రాన్ పట్ల భారత ప్రభుత్వం కూడా అప్రమత్తం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

మన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. అన్ని రాష్ట్రాలకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సలహాలు, ఆదేశాలు ఆరోగ్యశాఖ జారీ చేసింది. కొత్తరకం వైరస్‌లను దేశంలో ప్రవేశించి విస్తరించకుండా సకాలంలో గుర్తించి అదుపులో ఉంచేందుకు అవసరమైన కసరత్తు చేస్తామని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ వివరించారు. ప్రస్తుతం వారానికి 1200 కేసులు నమోదవు తున్నట్లుగా ఆరోగ్యశాఖ వెల్లడించింది. గడచిన 24 గంటల్లో 129 ఇన్‌ఫెక్షన్ కేసులు నమోదుకాగా ఒకరు మరణించారు. అందువల్ల మాస్క్‌లను ధరించడం లాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ కోరింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా ఉన్నతాధికారులు, నిపుణులు సమావేశమై మరోసారి ఇన్‌ఫెక్షన్ విస్తరించకుండా ప్రణాళికను రూపొందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతిఒక్కరూ మాస్క్‌లు ధరించారు. దేశంలోకి వచ్చే వారిని పరీక్షించేందుకు అన్ని జాతీయ,అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఇతర మార్గాల ద్వారా దేశంలో ప్రవేశించే కేంద్రాలలో తీసుకోవలసిన ఆరు జాగ్రత్తలను ప్రకటిస్తామని ఆరోగ్యశాఖ వెల్లడించింది.

ఎడిట్ పేజి డెస్క్

సంపాదకీయం

బీజేపీ సొంతింట్లో అసమ్మతి సెగ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాలు చివరకు సొంతింట్లోని వారికి కూడా నచ్చడం లేదు. బీజేపీకి అనుబంధంగా ఉన్న భారతీయ కిసాన్ సంఘ్ (బి.కె.ఎస్)కు చెందిన రైతులు మంగళవారం దిల్లీలోని రాంలీలా మైదాన్‌లో ప్రభుత్వ వ్యవసాయ విధానాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో పంజాబీ భాషే కాదు, తమిళం, మరాఠీ, గుజరాతీ, అస్సామి తదితర స్వరాలూ వినిపించాయి. దాదాపు 550 జిల్లాలకు చెందినవారు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి కిసాన్‌నిధి మొత్తం పెంచాలని, వ్యవసాయ ఉత్పత్తులను జి.ఎస్.టి. పరిధి నుంచి తొలగించాలనీ, జన్యు మార్పిడి చేసిన పంటలకు ఇచ్చిన ఆమోదాన్ని ఉపసంహరించాలని బి.కె.ఎస్. కోరుతోంది. ఉత్తరప్రదేశ్‌లో స్వేచ్ఛగా సంచరించే పశువులు పంట పొలాలను నాశనంచేస్తున్న సమస్యను పరిష్కరిస్తామన్న మోదీ హామీ సైతం అమలుకాని మిగతా హామీల ఖాతాలో చేరిపోయింది. ఈ సమస్యవల్ల రైతులు తెల్లవార్లూ జాగారంచేసి తమ పంటలకు కాపలా కాయాల్సి వస్తోంది. చెరకుధరలు, జన్యు మార్పిడి చేసిన ఆవాలకు ఇచ్చిన అనుమతి ఉపసంహరించడం, ప్రధానమంత్రి నీటిపారుదల పథకం వైఫల్యం, మార్కెట్లు అందుబాటులో లేకపోవడం, చాలా సందర్భాలలో రైతులబ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం సహాయంకింద అందించే మొత్తం బదిలీ కాకపోవడం మొదలైన సమస్యలను నిరసనకు దిగిన బి.కె.ఎస్ ఎత్తి చూపింది. ఇతర రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉన్న రైతుసంఘాలు కూడా సరిగ్గా ఇవే సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నాయి. అంటే రైతులందరికీ ఉమ్మడిగా ఉన్న సమస్యలను బి.కె.ఎస్ కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తోంది. ప్రభుత్వ విధానాలకు తలూపి మిన్నకుంటే ఇబ్బందులు దూరంకావని బీజేపీకి అనుబంధంగా ఉన్న రైతుసంఘం కూడా భావిస్తోంది. ప్రజల ఉమ్మడిసమస్యలను పట్టించుకోవడంలో తాము ఎవరికీ తీసిపోము అని ఈ రైతుసంఘం అంటోందంటే మోదీ ప్రభుత్వవిధానాలు అందరినీ ఒకేరకంగా వేపుకు తింటున్నాయనే అర్థం. అరుణాచల్‌ప్రదేశ్‌లోని రైతులు కమలాఫలాలకు సరైనధర లభించనందువల్ల వాటిని పార బోయవలసి వస్తోంది. ఈ పళ్ల అమ్మకం రైతులకు పెద్ద సమస్యగా తయారైంది. మోదీ ప్రభుత్వం జన్‌ధన్, ఆధార్, మొబైల్ ఫోన్లను అనుసంధానించామని గొప్పలు చెప్పుకుంటున్నా 2019 తరవాత నేరుగా రైతుల ఖాతాల్లోకి డబ్బు బదిలీచేసే పద్ధతి కిందికి ఒక్కరైతును కూడా చేర్చలేదు. వాణిజ్యపన్నుల మంత్రిత్వశాఖ రైతులను శత్రువుగా వ్యవహరిస్తోందని నిరసనకు దిగిన రైతులు ఆరోపించారు. రైతులుపంట బాగా పండించిన దశలో ఎగుమతులను నిషేధించి రైతుల పొట్ట కొడ్తున్నారు. ఇక రైతుల ఆదాయం రెండింతలు అయ్యే అవకాశం ఎన్నటికి నేరవేరుతుంది అని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాము దాన ధర్మాలకోసం అడగడంలేదని, పంట పండించడానికి అయ్యే ఖర్చయినా రాకపోతే తమ గతి ఏమిటని రైతులు నిలదీస్తున్నారు. బీజేపీకి అనుకూలమైన రైతుసంఘానికి చెందినవారే ఇలా మాట్లాడుతున్నారంటే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను తు.చ తప్పకుండా అమలుచేస్తున్నామని మోదీ ప్రభుత్వం చెప్పడం కేవలం డోలు వాయించడమేనని తేలిపోతోంది.

జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని ప్రధానమంత్రి ఊదరగొడ్తుంటారు. కానీ ఆయన మంత్రివర్గంలోని వ్యవసాయమంత్రిత్వశాఖ మాత్రం జన్యుమార్పిడి చేసిన పంటలకు అనుమతిస్తుంది. కలుపు మొక్కలవల్ల నష్టం కలగకుండా ఈ ఆవాల రకం చూసేది నిజమే కావచ్చు కానీ ఆ పంట కాన్సర్‌కు దారి తీస్తుంది. ఔషధ గుణాలున్న మొక్కలన్నింటినీ నాశనం చేస్తుంది. తేనెటీగలనూ ధ్వంసంచేస్తుంది. దీనివల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోంది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో బీజేపీ అనుకూల రైతుసంఘానికి చెందిన వారు నిరసనకు దిగడం అంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం అవుతోంది. జన్యు మార్పిడి రకాలు దేశవాళీ విత్తనాల ఆనవాలు లేకుండా చేస్తాయి. అందుకే రైతులు "విషం వద్దు, సేంద్రీయ పంటలు కావాలి" అనిచేసిన నినాదాలు మిన్నంటాయి. కానీ పార్లమెంటులో ఆసీనులైన బీజేపీ ఎంపీల చెవిదాకా ఈ నినాదాలు ప్రతిధ్వనించాయో లేదో తెలియదు. తమఘోష ప్రభుత్వం చెవికెక్కకపోతే దేశం నలు మూలల నుంచి ఇవే నినాదాలు వినిపిస్తాయని బి.కె.ఎస్ నాయకుడు ఒకరన్నారు. చాలాకాలం ఓపికపట్టిన తరవాతే బి.కె.ఎస్ ఉద్యమబాట పట్టింది. వ్యవసాయ విధానాల విషయంలో బీజేపీకి అనుకూలమైన రైతుసంఘానికి, మోదీ ప్రభుత్వానికి శ్రుతి కలవడం లేదు. బి.కె.ఎస్ ఆధ్వర్యంలో రైతులు రోడ్డెక్కారు అంటే ఇంతవరకు చేసిన విజ్ఞప్తులు, పెట్టుకున్న అర్జీలు, అంతర్గతంగా సాగిన చర్చలు ఏమాత్రం ఫలించ లేదనే అనుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఏప్రభుత్వమైనా ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నప్పుడు తమ బాధ వినిపించే హక్కు బీజేపీ అనుబంధంగా ఉన్న సంఘాలూ వినియోగించుకోక తప్పని పరిస్థితి వస్తుంది. ప్రభుత్వ అనుకూల సంఘాలు కూడా తమహక్కులకోసం పోరాడవలసిన అగత్యం ఉంటుంది. మోదీ ప్రభుత్వం వ్యవసాయ విధానాలను రూపొందించేటప్పుడు బీజేపీకి అనుకూలమైన వివిధ సంఘాలతో చర్చించకపోలేదు. కానీ ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే లాబీలు చాలా శక్తిమంతంగా ఉన్నాయి కనకే ప్రభుత్వం వాటికి లొంగిపోయి రైతులకు నష్టంకలిగించే విధానాలు రూపొందించింది. ఇందులో విదేశీశక్తుల, ముఖ్యంగా అమెరికన్ గుత్త కంపెనీల ప్రమేయం ఉందని బి.కె.ఎస్ గట్టిగా భావిస్తోంది. విదేశీ ఒత్తిడులకు మోదీప్రభుత్వం లొంగిపోకుండా స్వదేశీ రైతులను ప్రోత్సహిస్తే మూడేళ్లలో నూనెగింజల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించి చూపిస్తాం అని రైతులు అంటున్నారు. పప్పుల విషయంలో మనం స్వయంసమృద్ధి సాధించ గలిగాం. కానీ మోదీ ప్రభుత్వం విదేశీ గుత్త కంపెనీలకు ఇచ్చిన విలువ మన రైతులకు ఇవ్వదు. వ్యవసాయరంగానికి ఇస్తున్న రాయితీలు రైతులకు కాకుండా కంపెనీలకు అందుతున్నాయి. పంటరుణాల మాఫీ రైతులకు ప్రయోజనం కలిగించకపోగా బ్యాంకులకే లాభించింది. కేంద్ర ప్రభుత్వం ఎకరాకు ఆరువేల చొప్పున రైతులకు అందిస్తున్నా, ఆమొత్తం నిర్ణయించినప్పటి ధరలు ఇప్పుడు లేవు. పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇతర వస్తువుల, వ్యవసాయ పెట్టుబడుల ఖర్చులు పెరిగిపోతూ ఉంటే రైతుల ఆదాయం 2022 కల్లా రెట్టింపు ఎలాఅవుతుందో సమాధానంచెప్పే నాధుడే లేడు. బీజేపీ పెరట్లోని వివిధసంఘాలే ప్రభుత్వ విధానాలను సహించనిస్థితిలో మోదీ ప్రభుత్వం ఉంది. ఎంత సమర్థకులైనా బాధను ఎల్లకాలం దిగమింగుకోవడం సాధ్యంకావడం లేదని బి.కె.ఎస్ దిల్లీ నిరసన నిరూపించింది.

జీవ వైవిధ్య ఒప్పందం లక్ష్యాలు సాధ్యమేనా?

మొదటిసారిగా ప్రపంచ వ్యాప్తంగా జీవ వైవిధ్యంపై మొదటిసారిగా ఒప్పందం కుదిరింది. ఆహ్వానించవలసిందే. ఐక్యరాజ్య సమితి (ఐరాస) అధ్వర్యంలో కెనడా రాజధాని మాంట్రియల్‌లో 15 వ జీవ వైవిధ్య సదస్సు జరిగింది. భారత్‌తో సహా 190 దేశాల ప్రతినిధులు పాల్గొని చర్చించి ఒప్పందం చేసుకున్నారు. 2030 నాటికి ఈ ధరిత్రిపై 30 శాతం జీవ వైవిధ్యం కాపాడాలన్నది ఒప్పందంలో ప్రధానమైంది. జీవ వైవిధ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్‌ను (జీబీఎఫ్) చైనా తదితర దేశాలు రూపొందించాయి. నాలుగు గమ్యాలు, 23 లక్ష్యాలను 2030 నాటికి సాధించాలి. భూమిపైన 17 శాతం నివాస, సముద్రాలలో 10 శాతం జీవ వైవిధ్యం కాపాడటానికి నిర్ణయం జరిగింది. మరో మూడు శాతం ఇతర విధాలుగా సాధించాలి. ఈ విశ్వంలో గల జీవరాశులన్నిటినీ కలిపి జీవావరణం లేదా పర్యావరణం అంటున్నారు. ఈ జీవరాశులన్నీ సురక్షితంగా ఉంటేనే జీవ వైవిధ్యం సురక్షితంగా ఉంటుంది. అయితే ఇప్పటికే జీవ వైవిధ్యం గణనీయంగా ధ్వంసమైపోయింది. ఇందుకు ప్రధాన కారణం మనమే. ఆయా దేశాల్లో ప్రభుత్వాలు అనుసరించే 'అభివృద్ధి' పథకాలు పర్యావరణ కాలుష్యం తిరిగి కోలుకోలేనంతగా పాడైపోవడానికి, భూతాపం ప్రమాదకరంగా పెరిగి, ప్రపంచ మానవాళి మనుగడ ప్రశ్నార్థకం చేశాయి.

1972 లో స్టాక్‌హోమ్‌లో జరిగిన ధరిత్రి పరిరక్షణ సదస్సు తర్వాత ఐరాస అధ్వర్యంలో ఇంతవరకు 27 కాప్ (వివిధ దేశాల) సదస్సులు జరిగాయి. మొత్తం సదస్సుల్లో క్యోటో ఒప్పందం, గతంలో జరిగిన మాంట్రియల్ ఒప్పందం, పారిస్ సదస్సు , 2021లో జరిగిన గ్లాస్గో, ఇటీవల ఈజిప్టులో జరిగిన సదస్సులో జరిగిన ఒప్పందాలను అమలు చేయలేదు. అరకొర నిర్ణయాలే తీసుకొని అమలు చేశారు. గ్లాస్గో ఒప్పందంలోనే 2030 నాటికి సాధించవలసిన లక్ష్యాలను నిర్ణయించారు. వీటిలో చాలా తక్కువగానే సాధించారని, రానున్న ఐదేళ్ల కాలంలో సైతం సాధించే అవకాశం కనిపించడం లేదని, ఆయా ప్రభుత్వాలు సమర్పించిన ఐదేళ్ల ప్రణాళికలు స్పష్టం చేస్తున్నాయని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ప్రకటించారు. గ్లాస్గో సదస్సుకు ముందు గుటెర్రస్ ప్రటించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన జీవ వైవిధ్యం సదస్సు చేసిన నిర్ణయాలను, లక్ష్యాలను సాధించడం సాధ్యమేనా? సమస్త జీవరాశులు గల జీవ వైవిధ్యం అయితే ఇప్పటికే 14 లక్షల జీవజాతులు అంతరించాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. పరిశోధకుల అంచనా మేరకు గడచిన నాలుగు వందల కోట్ల సంవత్సరాల జీవ పరిణామ క్రమమంతా జీవవైవిధ్యం ఏర్పడింది. వ్యవసాయానికి తప్పనిసరైన పుప్పొడి పరాగ రేణువుల వ్యాప్తిని కొన్ని క్రిమికీటకాలు చేస్తాయి. జీవ వైవిధ్యం క్షీణించడానికి ఈ విషయాలు ప్రధాన కారణం. అలాగే అడవులూ కారణమే. జీవ వైవిధ్యం పరిరక్షణ చర్యలు తీసుకోవడానికి వ్యవసాయ రంగాన్ని సమూలంగా మార్చాలి. కృత్రిమ ఎరువులను, పురుగు మందులను నిలిపివేసి ప్రకృతి సేద్యాన్ని చేపట్టాలి. ఇలా మార్పుచేస్తే పంటల దిగుబడి ఒకేసారి పడిపోవచ్చు. అప్పుడు ఆహారధాన్యాల కొరత ఏర్పడుతుంది. ఇది చాలా నెమ్మదిగా, దీర్ఘకాలం అమలు చేయవలసిన ప్రక్రియ. 2030 నాటికి ఈ విధానం అమలు చేయగలమా?

ఈ ఒప్పందం అమలు చేయాలంటే ధనిక దేశాలు పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు సమకూర్చాలని లేకపోతే ఒప్పందం నుండి వైదొలగుతామని కాంగో చివరిలో హెచ్చరించింది. అనేక దేశాలు ఈ బాటను ఎంచుకొనే అవకాశం ఉంది. వ్యవసాయానికిచ్చే సబ్సిడీలను కొనసాగించాలని భారతదేశం, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు డిమాండ్ చేశాయి. అయితే ఈ విషయాన్ని తుది ఒప్పందం పత్రంలో చేర్చారా లేదా అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. సబ్సిడీలు లేకపోతే వ్యవసాయం సంక్షోభంలో పడిపోయిఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. అయితే ఆర్థిక రంగానికి హాని కలిగించే సబ్సిడీలను తగ్గించాలని ఒప్పందంలో చేరుస్తామని ఒప్పందం రూపొందించిన దేశాలు చెప్పాయి. ఏవి హానికరమనేది 2025 నాటికి నిర్ధారిస్తారు. ఈ సంస్కరణలో ఇచ్చే ప్రోత్సాహకాలు నిష్పత్తి ప్రకారం, న్యాయంగా, సమానంగా ఉండాలని అనేక దేశాలు కోరాయి. అందువల్ల ఆయా దేశాలు ప్రస్తుతం రూపొందించుకున్న ప్రణాళికలు అమలు చేసే సామర్థ్యం పైనే జీవ వైవిధ్యం పరిరక్షణ ఆధారపడి ఉంటుంది. వ్యవసాయ, మత్స్య పరిశ్రమకిచ్చే సబ్సిడీల రద్దు అంశాన్ని ఒప్పందం నుంచి తొలగించాలని భారత్ ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పాటు జపాన్ గట్టిగా డిమాండ్ చేశాయి.ఒప్పందంలో చేర్చినా అమలు చేయకపోతే ఏం చేయాలి.గత ఒప్పందాలను అమలును చేయనప్పుడు ఐరాస ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎందుకంటే దానికి ఆ అధికారం లేదు. జీవ వైవిధ్యం రక్షణ లక్ష్యాలు పారిస్ ఒప్పందంలోనూ ఉన్నాయి. పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు, నూతన సంకేతికలు అందించాలన్న ఒప్పందాలను ధనిక దేశాలు పెద్దగా పట్టించుకోలేదు. 2025 నాటికి ధనిక దేశాలు కనీసం 20 బిలియన్ డాలర్లు ఇవ్వాలని అభివృద్ధి చెందుతున్న దేశాల విజ్ఞప్తిని పట్టించుకొనే అవకాశాలు తక్కువే. అన్నిటి కంటే ముఖ్యంగా గమనించాల్సిన విషయం, దేశాల మూలవాసులేనని 80 శాతం జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తున్నారు. అభివృద్ధి పేరుతో అడవులను ధ్వంసం చేసి అక్కడ నివశిస్తున్న మూలవాసులను, గిరిజన జాతులను తొలగిస్తే జీవ వైవిధ్యం మరింత నాశనం కాదా? కాలుష్యం, భూతాపం పెరుగుదలను, ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకోకుండా జన్యు పరివర్తిత విత్తనాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్న దేశాలు జీవ వైవిధ్యం కాపాడతాయా? ఎంత వరకు నమ్మాలి.

అడవుల్లో నివశించే జంతువులు, పక్షులు, క్షీరదాలు, సరీసృపాలు తదితర అనేక రకాల జీవులలో 1970 నుండి ఇప్పటి వరకు 69 శాతం నశించాయని లివింగ్ ప్లానెట్ రిపోర్టు (ఎల్‌పిఆర్)- 2022 నివేదిక తెలిపింది. ప్రపంచ జంతుజాల నిధి సంస్థ పరిధిలో ఎల్‌పిఆర్ పని చేస్తోంది. ఆర్థిక సహాయం సమస్యపై తీవ్రమైన చర్చ జరిగిన తర్వాత 2025 నాటికి 20 బిలియన్ డాలర్లు 2030 నాటికి 30 బిలియన్ డాలర్లు సహాయం అందించడానికి ధనిక దేశాలు అంగీకరించాయి. ధరిత్రికి ఎదురుకానున్న ప్రమాదాన్ని గుర్తించి ఆయా దేశాలు నూతన ప్రణాళికలు రూపొందించుకొని వేగంగా అమలు జరపాలి. భారత ప్రభుత్వం ఈ దిశలో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందని ఆశిద్దాం.

టి.వి.సుబ్బయ్య

ప్రభుత్వ బడుల్లో గ్రంథాలయాలు అవశ్యం

గ్రంథాలయం విజ్ఞాన భాండాగారాం. విద్యాలయం, వైద్యాలయం, గ్రంథాలయం, చక్కటి సమాజ నిర్మాణంలో కీలకం. చరిత్రను తెలుసుకోవడంలోనూ, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంలో గ్రంథాలయాల పాత్ర కీలకమైంది. అధునిక యుగంలో విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంలో గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. గ్రంథాలయాలు జాతి ఉన్నతికి పట్టుగొమ్మలు. చరిత్రలో యుద్ధాల కంటే విజ్ఞానమే ఎక్కువ స్వేచ్ఛను రగిలించింది, వికాసానికి నాంది పలికింది. చరిత్రలో అలాంటి అనేక మార్పులకు నాంది పలికిన గ్రంథాలయాలు నేడు అంపశయ్యపై ఉన్నాయి. స్వాతంత్ర్యోద్యమ సమయంలో గ్రంథాలయ ఉద్యమం కీలక భూమిక పోషించింది. గ్రంథాలయ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రజాసైన్స్ వేదిక నాయకులు సి.ఏ.ప్రసాద్, మాల్యాద్రి ప్రవాసాంధ్రుల సహకారంతో నెల్లూరులో 10, ప్రకాశంలో 177, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో మూడు పాఠశాలల్లో గ్రంథాలయాలు నెలకొల్పారు. ప్రభుత్వ బడులలో దాతల సహకారంతో విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు ఐదు సంవత్సరాలుగా కృషిచేస్తూ ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రతి పాఠశాలకు ముప్పైవేల రూపాయల విలువగల పుస్తకాలు అందించి కొన్నింటిలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. లెర్న్ అండ్ హెల్ప్ వ్యవస్థాపకులు శివరామకృష్ణ జాస్తి. రెండు తెలుగు రాష్ట్రాలలో నలభైకిపైగా పాఠశాలల్లో గ్రంథాలయాలు నెలకొల్పారు. ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరమ్‌లోని 240 గ్రూప్ సభ్యులు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యకు సంబంధించిన యాక్టివిటీస్ చేయడం, పిల్లల్లో పఠనాశక్తి పెంపుదలకు ఫ్రూట్స్ అనే పేరుతో సృజనాత్మకత పెంపొందించే కార్యక్రమాలు రూపకల్పన చేశారు. పుస్తకాలు దాదాపు బాలసాహిత్యం, విజ్ఞాన పాఠ్యంశాలు, ఆదర్శమూర్తుల జీవితకథలు,పొడుపు, నీతి కథలు, ఆహార అలవాట్లు, వ్యక్తిత్వ వికాసం ఎక్కువగా ఉండేట్లు దాదాపు పదకొండు ప్రచురణ కర్తలు ముద్రించిన పుస్తకాలు పాఠశాలలకు ఇచ్చారు. నేషనల్ బుక్‌ట్రస్ట్, చిల్డ్రన్ బుక్‌ట్రస్ట్, ప్రథమ్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్, పీకాక్ క్లాసిక్స్, సాహితీ, ఎమెస్కో అలకనంద, ప్రజాశక్తి, విశాలాంధ్ర, విజ్ఞాన ప్రచురణలు, మంచిపుస్తకం, జయంతి పబ్లికేషన్స్ నుంచి బై లింగ్యువల్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. "ఉయ్ లవ్ రీడింగ్", పుస్తకాలతో నేస్తం పథకాన్ని 2020 నవంబర్ 26 రాజ్యాంగ దినాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వపాఠశాలల్లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, పిల్లల సాహిత్యంపై అభిమానం ఉన్న రచయితలు, పిల్లల కోర్సు కంటెంట్, టీచింగ్ అండ్ లర్నింగ్ ప్రాసెస్‌లో మార్పులు ఆకాంక్షించే వ్యక్తులు భాగస్వామ్యులను చేసి వారితో నాలుగువందల పైచిలుకు పుస్తకాలు రాయించి అందులో తొంభై పుస్తకాలు జనవరి నెలలో ప్రచురిస్తున్నారు. స్థానికంగా చారిత్రక గుర్తింపు ఉండి నిరాదరణకు గురైన వాటిలో పిల్లలకు అర్థమయ్యే కథలు, కథానికలు, గేయాలు, పొడుపు కథలు

ఉన్నాయి. ఎక్కువ భాగం కథలు పెద్దలకు అర్థమయ్యే రీతిలో ఉండటంతో చాల పుస్తకాలు రీరైటింగ్ చేస్తున్నారు. చదవడం మాకు ఇష్టం ద్వారా వాక్యాల నుండి గ్రంథాల వరకు చదివే అభిరుచిని అలవాటుచేసి, చదవడంలోని ఆనందాన్ని పరిచయం చేసి పిల్లలను పుస్తక లోకంలోకి ఆహ్వానించి ఊహలకు రెక్కలు విచ్చుకునే మహోన్నత ఉద్యమం.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద, మధ్య తరగతి తల్లిదండ్రులను పీల్చి పిప్పిచేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ల దోపిడీని అరికట్ట వచ్చు. స్థానికంగా ఉన్న కళలు, కట్టుబాట్లు, చరిత్ర, ఆహార అలవాట్లు, పండుగలు, సంప్రదాయాలు ఆయా ప్రాంతాల్లో లభ్యమయ్యే వంటలు, తిండి పదార్థాలు, మరుగున పడిపోయిన పాతకాలపు పిండి వంటలు, పండ్లు వాటిపై అవగాహన పెరుగుతుంది. పుస్తక పఠనం ద్వారా పాఠశాల విద్యాభివృద్ధి- సామాజిక బాధ్యత. పిల్లలందరికీ విద్యనందించడం మనందరి సామాజిక బాధ్యత. సమాజంలోని ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే దేశంఅభివృద్ధి చెందుతుంది. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాఠశాల విద్యాభివృద్ధిలో భాగస్వాములైతే ప్రాథమిక స్థాయివిద్య అన్ని విధాలుగా అభివృద్ధి చెందడంతోపాటు విద్యా ప్రమాణాలు మెరుగవుతాయి. ప్రజల ఉపయోగార్థం అన్నిరకముల పుస్తకాలను ఒకేచోట చేర్చి పరిరక్షించు ప్రదేశాన్ని గ్రంథాలయం అని అంటారు. స్కూళ్లల్లో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు ద్వారా పిల్లలకు సాంకేతిక అంశాల పట్ల విషయ పరిజ్ఞానం పెంపొందించవచ్చు. పిల్లల్లో రచనా సామర్థ్యం పెంపొందించడానికి బాలల సాహిత్య వేదికలు ఏర్పరచడం, తరచూ వర్కుషాపు, ఓరియంటేషన్ ప్రోగ్రాంలు నిర్వహించాలి. సర్వశిక్ష అభియాన్, పాఠశాల విద్య కమిషనరేట్. గ్రంథాలయ సంస్థలను బలోపేతంచేసి అవసరమైన నిధులు సమకూరిస్తే రేపటి పౌరులను ఉత్తమ పౌరసమాజం దిశగా నడిపించవచ్చు. పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న బాల బాలికలందరికి అన్ని విషయాలలో ఆశించిన సామర్థ్యాలు సాధించడం ద్వారా గుణాత్మక విద్యను అందించటం సర్వశిక్షా అభియాన్ లక్ష్యం. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం బాలల సర్వతోముఖాభివృద్ధి జరగాలంటే సాధ్యమైనంత వరకు బోధనామాధ్యమం బాలల మాతృభాషగా ఉండాలి. బాలల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక, మానసిక శక్తులను పెంపొందే బోధన జరగాలి. పిల్లలను కేంద్రంగా చేసుకుని వారికి అనువైన బోధనా పద్ధతుల్లో కార్యక్రమాలు, పరిశోధనలు, కనుగొనడం ద్వారా నేర్చుకోవాలి. భయాలు, ఆందోళనల వంటి వాటి నుంచి బాలలకు విముక్తి చేసి వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించటంలో సహాయపడాలి. జ్ఞానాన్ని బాలలు అర్థం చేసుకునే విధానం, దానిని అన్వయించే సామర్థ్యాలపై నిరంతర సమగ్ర మూల్యాంకన జరగాలి.

ప్రస్తుత పాఠశాలలో అమలవుతున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (లైఫ్) ద్వారా విద్యార్థి, తరగతి, పాఠశాల వారీగా గ్రేడింగ్ నిర్ణయించి విద్యార్థుల అభివృద్ధికి కృషి జరగాలి. పాఠశాలలో 1,2,3 తరగతి పిల్లల కొరకు స్నేహ బాలకార్డులు ద్వారా బోధన జరగాలి. విద్యాబోధనలో నిరంతరం కొత్తదనాన్ని చూపిస్తూ, పిల్లల జ్ఞాన సముపార్జన లక్ష్యంగా ముందుకెళితే గుణాత్మకతను సాధించవచ్చును. పిల్లల్లో పఠనాసక్తిని, పుస్తకాల పట్ల ప్రేమను పెంపొందించటానికి పుస్తకాలతో స్నేహం పేరుతో మొత్తం నాలుగు స్థాయిలలో పది పుస్తకాల చొప్పున 10 సెట్లతో వంద పుస్తకాలు ప్రచురించారు. ఇప్పటి వరకు 8 సెట్లలో 75 పుస్తకాలు ప్రచురించారు. మొదటి 7 సెట్లలో ఒక్కొక్కటి 16 పేజీల చొప్పున పదేసి పుస్తకాలు ఉన్నాయి, 8 వ సెట్టులో ఒక్కొక్కటి 32 పేజీల చొప్పున 5 పుస్తకాలు ఉన్నాయి. శిశు ప్రాయంలో పిల్లల్లో విజ్ఞానదాయక విషయాలపై ఆసక్తి పెంపొందించేందుకు కృషిచేసి ఆదర్శంగా నిలుస్తున్నారు.

డా.యం. సురేష్‌బాబు, 9989988912

ప్రజాస్వామ్యానికి అప్రతిష్ఠ

- చైనాతో ఘర్షణపై మౌనమెందుకు?
- కేంద్రానివి విభజన రాజకీయాలు
- న్యాయవ్యవస్థ గౌరవానికి భంగం
- సోనియాగాంధీ ధ్వజం
- మనపై గొప్ప బాధ్యత ఉందని ఎంపీలకు హితవు

న్యూఢిల్లీ : చైనాతో ఘర్షణపై చర్చకు అనుమతించకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపణ ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ విమర్శించారు. ఇది 'మన ప్రజాస్వామ్యానికి అగౌరవం' అని అన్నారు. బుధవారం ఇక్కడ పార్లమెంట్ సెంట్రల్ హాలులో పార్టీ ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా మాట్లాడుతూ 'అటువంటి ఒక తీవ్రమైన జాతీయ ఆందోళన విషయంలో పార్లమెంటులో చర్చకు అనుమతి నిరాకరించడం మన ప్రజాస్వామ్యం పట్ల అగౌరవాన్ని చూపుతుంది. ప్రభుత్వ ఉద్దేశాలు పేలవమైనవని ప్రతిబింబిస్తోంది. ఇది దేశాన్ని ఏకతాటి పైకి తీసుకురావడంలో దాని అసమర్థతను ప్రదర్శిస్తుంది' అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విభజన రాజకీయాలకు పాల్పడుతోందని సోనియా గాంధీ ధ్వజమెత్తారు. 'దీనికి విరుద్ధంగా, విభజన విధానాలను అనుసరించడం, ద్వేషాన్ని వ్యాప్తిచేయడం, సమాజంలోని కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా విదేశీ బెదిరింపులకు వ్యతిరేకంగా దేశమంతా ఒక్కటిగా నిలబడటాన్ని ప్రభుత్వం కష్టతరం చేస్తుంది. ఈ విభజనలు మనల్ని బలహీనపరుస్తాయి. మమ్మల్ని మరింత దుర్బలంగా మారుస్తాయి' అని ఆమె అన్నారు. ఇలాంటి సమయాల్లో మన ప్రజలను ఐక్యం చేయడం ప్రభుత్వ ప్రయత్నం, బాధ్యతగా ఉండాలి. కాంగ్రెస్ పార్టీకి బాధ్యతలు చాలా ఉన్నాయని సోనియాగాంధీ నొక్కి చెప్పారు. 'ప్రధాన ప్రతిపక్ష పార్టీగా, మనపై గొప్ప బాధ్యత ఉంది. దానిని నెరవేర్చడానికి మనల్ని మనం బలోపేతం చేసుకోవడం, పునరుద్ధరించుకోవడం కొనసాగించాలి' అని కాంగ్రెస్ నాయకురాలు తెలిపారు.

నిరుద్యోగం పరిస్థితి దారుణం

దేశంలో ద్రవ్యోల్బణంపై సోనియా ఆందోళన వ్యక్తం చేశారు. 'నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు తారస్థాయికి పెరిగిపోతున్నాయి. ఫలితంగా కోట్లాది కుటుంబాలపై తీవ్ర భారం పడింది. ముఖ్యంగా యువతకు ఉద్యోగాలు కల్పించకపోవడం ఈ ప్రభుత్వ లక్షణంగా మారింది' అని విమర్శించారు. 'ప్రధాని చేతుల మీదుగా కొన్ని వేల మందికి నియామక పత్రాలు అందజేసినప్పటికీ నిరుద్యోగం పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయకపోవడం, పరీక్షలు నమ్మదగిన విధంగా లేకపోవడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడంతో కోట్ల మంది భవిష్యత్తు అనిశ్చితిలోకి నెట్టబడింది' అని అన్నారు. 'దేశంలో భారీ ఉపాధి కల్పనకు దోహదపడే చిన్న వ్యాపారాలు... నోట్ల రద్దు, పేలవంగా అమలు చేయబడిన జీఎస్‌టీ, కోవిడ్-19 మహమ్మారిపై సరైన నిర్వహణ లేని ప్రతిస్పందన వంటి పదేపదే దెబ్బలు తిన్న తర్వాత ఇప్పటికీ మనుగడ కోసం పోరాడుతున్నాయి. ప్రత్యేకించి పెరిగిన ఎరువుల ధరలు, పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లభించకపోవడం, పెరుగుతున్న ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు' అని సోనియా తెలిపారు. న్యాయమూర్తుల నియామక ప్రక్రియపై న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు తరచూ చేస్తున్న ప్రకటనలను ప్రస్తావిస్తూ, 'సమస్యాత్మకమైన కొత్త పరిణామం న్యాయవ్యవస్థను చట్టవిరుద్ధం చేయడానికి జరుగుతున్న గణన ప్రయత్నం. వివిధ కారణాలపై న్యాయ వ్యవస్థపై దాడి చేసే ప్రసంగాలు చేయడానికి మంత్రులు, ఉన్నత రాజ్యాంగ అధికారాన్ని కూడా చేర్చుకున్నారు. ఇది అభివృద్ధి కోసం సహేతుకమైన సూచనలను అందించే ప్రయత్నం కాదని చాలా స్పష్టంగా ఉంది. బదులుగా, ఇది ప్రజల దృష్టిలో న్యాయ వ్యవస్థ స్థితిని తగ్గించే ప్రయత్నం' అని కాంగ్రెస్ నాయకురాలు చెప్పారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, అయితే గుజరాత్, ఢిల్లీలో ఫలితాలు 'దురదృష్టకరం' అని అన్నారు. విజయం సాధించినందుకు హిమాచల్ ప్రదేశ్‌లో పార్టీ శ్రేణులను అభినందిస్తూ, 'ఇప్పుడు, హిమాచల్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చవలసిన సమయం ఆసన్నమైంది' అని తెలిపారు. భారత్ జోడో యాత్ర ఒక 'గర్వించదగిన విషయం' అని ప్రశంసించారు. రాహుల్ గాంధీ ధైర్యసాహసాలు, సంకల్పం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చేసిన అలుపెరగని ప్రయత్నాలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. యాత్రకు ప్రతి భారతీయుడు మద్దతు ఇస్తున్నారని అన్నారు. దాని సౌభ్రాతృత్వం, సమానత్వ సందేశం, దాని ప్రతిస్పందన చాలా మంది భారతీయులు శాంతి, సామరస్యం, సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని కోరుకుంటున్నారని చూపిస్తుందని అన్నారు. పార్టీ అధ్యక్షుడి అయిన తర్వాత మల్లికార్జున ఖర్గేకు తొలి సీపీపీ సమావేశాన్ని ఆమె స్వాగతించారు. ఆయన మార్గదర్శకత్వంలో పార్టీ కొనసాగుతుందన్న ఆకాంక్షను వెలిబుచ్చారు.

రైతుల ముందే బీరాలు: ఆప్

న్యూఢిల్లీ: సరిహద్దు ఉద్రిక్తతలు, అరుణాచల్ ప్రదేశ్‌లో ఓ దేశం ఆక్రమణలపై ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్రాన్ని విమర్శించింది. రైతులకు 56 అంగుళాలు ఛాతి చూపించే ప్రభుత్వం, ఆ దేశం ముందు మాత్రం 0.56 అంగుళాలకు కుంచించుకుపోతుందని వ్యంగ్యాస్త్రాలు సంధించింది. సరహద్దుల సమస్యపై పార్లమెంటులో కేంద్రం చర్చించడం పోవడంపై ఆప్ నేత సంజయ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. దురాక్రమణలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు ఆప్, కాంగ్రెస్, జేడీయూ, సీపీఐ, సీపీఎం, ఆర్జేడీ, శివసేన, డీఎంకే, ఎన్సీపీ సహా 12 విపక్ష పార్టీలు బుధవారం నిరసనకు దిగాయి. ఈ సందర్భంగా సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ "ఎల్‌ఓసీ వెంబడి ఉద్రిక్తల అంశంపై పార్లమెంటుకు, దేశ ప్రజలకు కేంద్రం జవాబుదారిగా ఉండాలి. కానీ, ఇందుకు భిన్నంగా నిరసనలు తెలిపే రైతులకు ప్రభుత్వం 56 అంగుళాల ఛాతీ చూపించి, ఆ దేశం ముందుకు వచ్చే సరికి 0.56 అంగుళాలకు కుంచించుకు పోతుంది. ప్రభుత్వం ఎందుకలా చేస్తోంది? మన వీరజవాన్లు సరిహద్దుల భద్రత కోసం తమ ప్రాణాలు త్యాగం చేస్తున్నారు. అలాంటప్పుడు ఆ దేశంతో వర్తక వాణిజ్యాలను ఎందుకు ప్రమోట్ చేస్తోంది?" అని ప్రశ్నించారు.

మోదీ... నవ భారత జాతిపిత: అమృత ఫడ్నవీస్

ముంబై : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై అమృత ఫడ్నవీస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ మోదీ మన దేశానికి జాతి పిత అని పేర్కొన్నారు. మరి మహాత్మా గాంధీ సంగతి ఏమిటని ప్రశ్నించినపుడు ఆమె స్పందిస్తూ మోదీ నవ భారతానికి జాతిపిత అని వివరించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సతీమణి అమృత ఫడ్నవీస్ ఇటీవల నాగ్‌పూర్‌లో రచయితల సంఘం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని జాతిపితగా అభివర్ణించారు. అయితే మహాత్మా గాంధీ ఏమవుతారని ప్రశ్నించినప్పుడు ఆమె బదులిస్తూ, మోదీ నవ భారత జాతి పిత అని చెప్పారు. ఇద్దరు జాతి పితలు ఉన్నారని, ఒకరు నాటి తరానికి, మరొకరు నేటి తరానికి అని పేర్కొన్నారు. మోదీని జాతి పితగా అభివర్ణించడం అమృతకు కొత్త కాదు. ఆమె 2019 సెప్టెంబరు 17న ఇచ్చిన ట్వీట్‌లో మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయనను జాతి పితగా అభివర్ణించారు.

మేమూ కర్ణాటకలోకి: సంజయ్ రౌత్

ముంబై: 'ఆ దేశంలానే... మేం కూడా కర్ణాటకలోకి అడుగుపెడతాం' అంటూ శివసేన సీనియర్ నేత, ఎంపీ సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం కొత్త వివాదానికి తెరతీశాయి. కర్ణాటక-మహారాష్ట్ర మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, శివసేన నేత చేసిన వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. 'మేం కూడా కర్ణాటకలోకి వెళ్తాం. మాకు ఎవరి అనుమతి అవసరం లేదు. సరిహద్దు సమస్యను చర్చలతో పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం. కానీ, కర్ణాటక సీఎం అగ్నికి ఆజ్యం పోస్తున్నారు. మహారాష్ట్రలో ప్రస్తుత ప్రభుత్వం బలహీనంగా ఉంది. అందుకే సరిహద్దు వివాదంపై ఏ నిర్ణయమూ తీసుకోలేకపోతోంది" అని సంజయ్ రౌత్ అన్నారు. బెళగావిని మహారాష్ట్రలో విలీనం చేయాలని ఎన్నో దశాబ్దాలుగా డిమాండ్లు వినిపిస్తోన్న విషయం తెలిసిందే. ఈ సరిహద్దు వివాదంపై తాజాగా రెండు రాష్ట్రాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. ఇటీవల మహారాష్ట్ర నుంచి వెళ్లిన కొంతమంది శివసేన నేతలను కర్ణాటక పోలీసులు అడ్డుకోవడం ఉద్రిక్తతలకు దారితీసింది. ప్రస్తుతం ఈ రాష్ట్రాల్లో అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా.. ప్రతిపక్ష సభ్యులు ఈ అంశాన్ని ప్రధానంగా లేవనెత్తుతున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికారంలో ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఈ సరిహద్దు వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది.

జోడో యాత్రతో ప్రవర్తన మార్చే ప్రయత్నం: రాహుల్

న్యూఢిల్లీ: 'ప్రజాభిప్రాయం వినాల్సిన అవసరం లేదని బీజేపీ నేతలు భావిస్తున్నారు. గంటల తరబడి ఉపన్యాసాలు ఇస్తున్నారు. ఈ యాత్రలో అటువంటి ప్రవర్తనను మార్చేంచుకు మేం ప్రయత్నిస్తున్నాం' అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బుధవారం ఆయన బీజేపీపై నిప్పులు చెరిగారు. ఆయన నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్ర హర్యానాలో ప్రవేశించిన సందర్భంగా నుహ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఈ యాత్ర ద్వారా విద్వేష విపణిలో ప్రేమ దుకాణాన్ని తెరుస్తోందని చెప్పారు. బీజేపీని పరోక్షంగా ప్రస్తావిస్తూ, దేశంలో విద్వేషాన్ని వ్యాపింపజేయడం కోసం వీరు వెళ్లినప్పుడు, తమ భావజాలంగలవారు ప్రేమ, ఆప్యాయతలను వ్యాపింపజేయడానికి వెళతారని చెప్పారు. ఈరోజుల్లో కాంగ్రెస్, బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీల నేతలు, ప్రజల మధ్య అంతరం ఉందన్నారు. తమిళనాడులోని కన్యా కుమారి నుంచి సెప్టెంబరు 7న ప్రారంభమైన ఈ యాత్ర రాజస్థాన్ నుంచి బుధవారం హర్యానాలో ప్రవేశించింది. ఇప్పటి వరకు తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల గుండా ఈ యాత్ర సాగింది. చివరికి జమ్ముకశ్మీరులో ఈ యాత్ర ముగుస్తుంది.

సీవీసీ ఆదేశాలు బేఖాతరు

న్యూఢిల్లీ: అవినీతి అధికారులను శిక్షించాలంటూ కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఇచ్చిన ఆదేశాలను అనేక ప్రభుత్వశాఖలు పట్టించుకోలేదు. దీనికి సంబంధించి గత ఏడాది 55 కేసులు నమోదయ్యాయని కేంద్రప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. సీవీసీ అందించిన సమాచారం ప్రకారం... 2021లో 2,724 కేసులలో (248 ప్రాసిక్యూషన్ శాంక్షన్ కేసులతో సహా) కమిషన్ సలహా మేరకు సంబంధిత కాంపిటెంట్ అథారిటీ తుది నిర్ణయం తీసుకుందని కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. వీటిలో కమిషన్ ఆదేశాలను పట్టించుకోని 55 కేసులు గుర్తించినట్లు రాతపూర్వక సమాధానంలో ఆయన వివరించారు. సీవీసీ ఆదేశాలను బేఖాతరు చేసిన ప్రభుత్వ శాఖల్లో రైల్వేలు, పౌర విమానయానం, రోడ్డు రవాణా హైవేలు, ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖలు, ఆర్థిక శాఖ, జౌళి మంత్రిత్వ శాఖ, బొగ్గు మంత్రిత్వ శాఖ, ఎరువుల శాఖ, అణు ఇంధన శాఖ, విద్యుత్‌శాఖ, వాణిజ్య శాఖ, యువజన వ్యవహారాల శాఖ, ఉన్నత విద్య తదితర శాఖలు ఉన్నాయి.

4,798 మంది దివ్యాంగుల నియామకం

న్యూఢిల్లీ: గడచిన కొన్నేళ్లలో (2018 నుంచి 2021 వరకు) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోకి 4,798 మంది దివ్యాంగులను నేరుగా నియామకం చేసినట్లు కేంద్రం బుధవారం లోక్‌సభకు తెలిపింది. బెంచ్‌మార్క్ వికలాంగుల (పీడబ్ల్యూబీడీ) ఖాళీలను భర్తీ చేయడం నిరంతర ప్రక్రియ అని కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ రాతపూర్వక సమాధానంలో తెలిపారు. 'ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్ యాక్ట్, 2016' అమలులోకి రావడంతో గ్రూప్ ఎ, బి , సి కి సంబంధించి మొత్తం ఖాళీల సంఖ్యలో 4 శాతం దివ్యాంగులను నేరుగా నియమించుకోవాలని ఆయన చెప్పారు.

బ్యాంకులకు రూ.92,570 కోట్ల టోకరా

రూ.7,848 కోట్లతో అగ్రస్థానంలో చోక్సీ

న్యూఢిల్లీ: ఉద్దేశపూర్వకంగా బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన వారిలో అగ్రభాగాన నిలిచిన 50 మంది వివరాలను కేంద్రం ప్రకటించింది. రుణ ఎగవేతదారులు బ్యాంకులకు సుమారు రూ.92,570 కోట్లు ఎగవేసినట్లు ప్రభుత్వం పార్లమెంట్‌లో తెలిపింది. 2022 మార్చి 31 నాటికి ఆ మొత్తాన్ని వాళ్లు చెల్లించాల్సి ఉందని ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి భగవత్ కరాడ్ ఈ వివరాలను లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. అందరి కంటే అధికంగా గీతాంజలి జెమ్స్ డైమండ్ వ్యాపారి మెహుల్ చోక్సీ బ్యాంకులకు సుమారు రూ.7,848 కోట్లు ఎగ్గొట్టినట్లు పేర్కొన్నారు. ఇక బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టిన అగ్ర జాబితాలో ఉన్న వారిలో ఎరా ఇన్‌ఫ్రా తర్వాత స్థానంలో ఉంది. ఆ సంస్థ సుమారు రూ.5879 కోట్లు ఎగవేసింది. ఆ తర్వాత రీగో ఆగ్రో రూ.4803 కోట్లు, కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్(రూ.4,596 కోట్లు), ఏబీజీ షిప్‌యార్డ్(రూ.3708 కోట్లు), ఫ్రోస్ట్ ఇంటర్నేషనల్(రూ.3311 కోట్లు), విన్‌సమ్ డైమండ్స్ అండ్ జ్యువెల్లరీ(రూ.2931 కోట్లు), రోటొమాక్ గ్లోబల్(రూ.2893 కోట్లు), కోస్టల్ ప్రాజెక్ట్స్(రూ.2311 కోట్లు), జూమ్ డెవలపర్స్(రూ.2147 కోట్లు) సంస్థలు భారీగా బ్యాంకులకు టోపీ పెట్టాయి. ఆర్బీఐ ఇచ్చిన సమాచారం మేరకు ఈ విషయాన్ని మంత్రి తెలిపారు.

తీరు మార్చుకోకపోతే నీళ్లు ఇవ్వం

కర్ణాటకకు మహారాష్ట్ర హెచ్చరిక



నాగపూర్: మహారాష్ట్రకు అంగుళం భూమి కూడా ఇచ్చేది లేదని కర్ణాటక తేల్చిచెప్పింది. దీంతో మహారాష్ట్ర ఘాటుగా స్పందించింది. దక్షిణాది రాష్ట్రం, అక్కడి ముఖ్యమంత్రి తీరు మారకుంటే తమ డ్యామ్‌ల నుంచి నీళ్లు ఇవ్వమని హెచ్చరించింది. కర్ణాటక సీఎం బసవరాజ్ బొమ్మై బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని, రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న ఆయన ఇలా ప్రవర్తించడం సబబు కాదని మహారాష్ట్ర మంత్రి శంభురాజ్ దేశాయ్ అన్నారు. కర్ణాటకతో సరిహద్దు వివాదంపై కేసు కోర్టు విచారణలో ఉన్నందున న్యాయబృందంతో సమన్వయం కోసం నోడల్ మంత్రులుగా శంభురాజ్ దేశాయ్, చంద్రకాంత్ పాటిల్‌ను మహారాష్ట్ర ప్రభుత్వం గతనెలలో నియమించింది. ఇదే క్రమంలో దేశాయ్ బుధవారం నాగపూర్‌లోని విధాన్‌భవన్ కాంపెక్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ అంగుళం భూమి కూడా ఇవ్వమన్న కర్ణాటక ప్రభుత్వం, సీఎం బొమ్మై తీరును దుయ్యబట్టారు. ఒక ముఖ్యమంత్రి బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు. ఇదే తీరు కొనసాగితే మహారాష్ట్ర కూడా దీటైన బదులివ్వగలదని హెచ్చరించారు. శాంతంగా ఉన్న మహారాష్ట్రను రెచ్చగొట్టవద్దని సూచించారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో మహారాష్ట్రలోని కోయనా, కృష్ణ డ్యామ్‌ల నుంచి జరిగే నీటి సరఫరాపై ఎక్కువగా ఆధారపడే విషయాన్నీ దక్షిణాది రాష్ట్రం మరువరాదని దేశాయ్ అన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని మరాఠీ మాట్లాడే ప్రజలకు మహారాష్ట్ర అండగా ఉంటుందన్నారు. కర్ణాటకకు నీటి సరఫరాను నియంత్రించేందుకు డ్యామ్‌ల ఎత్తును మహారాష్ట్ర పెంచాలని ఎన్సీపీ నేత జయంత్ పాటిల్ అన్నారు. కాగా, 1957 నుంచి రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం ఉంది. ఒకప్పుడు బాంబే పరిధిలో ఉన్న బెళగావి తమదని మహారాష్ట్ర దావా చేస్తోంది. అక్కడ మరాఠీ మాట్లాడే జనాభా ఎక్కువని, 800 గ్రామాల్లో మరాఠీ మాట్లాడే వారున్నారని చెబుతోంది. అటు కర్ణాటక తమ భూభాగంలో అంగుళం కూడా ఇచ్చేది లేదని, సరిహద్దు వివాదం సర్దుమణిగిందని అంటోంది. దీంతో ఇరు రాష్ట్రాల మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది.

ప్రత్యర్థులపై పెగాసస్‌తో గూఢచర్యం

కాంగ్రెస్ విమర్శ: అలాంటిదేమీ లేదన్న అమిత్‌షా

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్ స్పైవేర్ పెగాసస్‌తో ప్రతిపక్ష రాజకీయ నాయకులపై కేంద్ర ప్రభుత్వం గూఢచర్యానికి పాల్పడిందని లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగోయ్ విమర్శించారు. కాగా దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మీరు చెబుతున్న దానికి ఆధారాలు ఇవ్వాలని ఆయనను కోరారు. మాదకద్రవ్యాల వ్యాప్తిపై లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొన్న గొగోయ్... దేశంలోని భూ, సముద్ర సరిహద్దులతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో నిషిద్ధ వస్తువుల ప్రవేశాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం ఏ విధమైన నిఘా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసిందో చెప్పాలని కోరారు. భారత్-మైన్మార్ సరిహద్దులో ఆయుధాలు, మానవ అక్రమ రవాణా, జంతు భాగాల స్మగ్లింగ్‌ను అరికట్టడానికి ఎలాంటి నిఘా, గూఢచర్య వ్యవస్థ అమలులో ఉన్నాయో చెప్పాలని కాంగ్రెస్ సభ్యుడు హోంమంత్రిని కోరారు. 'పెగాసస్ ద్వారా మీరు ఇప్పటివరకు ఎన్ని డ్రగ్స్ మాఫియాలను పట్టుకున్నారో మాకు చెప్పండి' అని షాను గొగోయ్ ప్రశ్నించారు. 'మీరు మాపై పదే పదే గూఢచర్యం చేస్తారు. మా ఫోన్‌లలో, జర్నలిస్టుల ఫోన్‌లలో పెగాసస్‌ని ఇన్‌స్టాల్ చేశారు' అని అన్నారు. గొగోయ్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేసిన షా...తన ఆరోపణలకు ఆధారాలను సభలో సమర్పించాలని లేదా ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. పెగాసస్‌ను నిఘా కోసం ఉపయోగించారా లేదా అని సభకు చెప్పాలని ప్రభుత్వాన్ని కోరడంలో ఏదైనా తప్పు జరిగితే ఆర్డర్ జారీ చేయాలని గొగోయ్ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. స్పీకర్ జోక్యం చేసుకుంటూ... తమ అభిప్రాయాలను వాస్తవాలు, రుజువులతో చెబితే అది సభ గౌరవాన్ని పెంచుతుందని అన్నారు.

ఫోన్లు, చార్జర్లు తీయనక్కర్లేదు

బ్యాగుల్లో ఉండగానే ఎలక్ట్రానిక్ పరికరాల తనిఖీలు

విమానాశ్రయాల్లో కొత్త స్కానర్లకు ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: విమానాశ్రయాల్లో తనిఖీల పద్ధతుల్లో మార్పు రాబోతోంది. త్వరలోనే కొత్త అత్యాధునిక స్కానర్లు అందుబాటులోకి వచ్చే సూచనలు ఉన్నాయి. ఈ క్రమంలో ఫోన్లు, చార్జర్లు, ల్యాప్‌టాప్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు బ్యాగుల్లో ఉండగానే తనిఖీలు నిర్వహించే వీలు కలుగుతుంది. ఈమేరకు ప్రతిపాదనలను అత్యాధునిక స్కానర్ల ఏర్పాటు కోసం విమానయాన భద్రతా పర్యవేక్షణ సంస్థ చేసింది. ప్రస్తుతం విమానాశ్రయాల్లో వినియోగించే స్కానర్లు.. హ్యాండ్ లగేజిలోని వస్తువులను టు-డైమెన్షనల్(2డీ)లో చూపిస్తాయి. అయితే వీటిని 3డీలో చూపించేలా కంప్యూటర్ టోమోగ్రఫీ టెక్నాలజీ ఆధారిత స్కానర్లు వాడాలని ప్రతిపాదించినట్లు బీసీఏఎస్ సంయుక్త డైరెక్టర్ జనరల్ జైదీప్ ప్రసాద్ తెలిపారు. ఈ స్కానర్లతో ప్రయాణికులు... వారి హ్యాండ్ బ్యాగేజీల నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులు, పరికరాలను బయటకు తీసి ప్రత్యేక ట్రేలలో ఉంచి తనిఖీలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయనన్నారు. తద్వారా సమయం ఆదా అవ్వడమే కాకుండా రద్దీ తగ్గుతుందని తెలిపారు. ఇప్పటికే అమెరికా, యూరప్ దేశాల్లో ఇలాంటి స్కానర్లు వినియోగమవుతుండగా భారత్‌లో వీటిని ఎప్పుడు ఏర్పాటు చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. అయితే వచ్చే ఏడాదిలో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ తదితర విమానాశ్రయాల్లో కొత్త స్కానర్లు అందుబాటులోకి రావచ్చు అని తెలుస్తోంది.

వెంటిలేటర్ లేక మరో ప్రాణం పోరాదు

మహారాష్ట్ర ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాల కల్పనపై దృష్టిపెట్టాలి

అసెంబ్లీలో అజిత్ పవార్ డిమాండ్

నాగపూర్/ముంబై: మహారాష్ట్రలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సదుపాయాలు ఉండేలా చూడాలని ప్రభుత్వానికి ప్రతిపక్ష నేత అజిత్ పవార్ సూచించారు. ఆయన బుధవారం మహారాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడుతూ నాగపూర్ వైద్య కళాశాలలో మందులు, వెంటిలేటర్లను సరిపడిన స్థాయిలో అందుబాటులో ఉంచాలని, వైద్యులను నియమించాలని ఆ డిమాండ్ చేశారు. నాగపూర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో వెంటిలేటర్లు లేని కారణంగా 17ఏళ్ల అమ్మాయి తన తల్లిదండ్రుల కళ్లెదుటే ప్రాణాలు విడిచిందని, ఇది బాధాకరమని, ప్రభుత్వం తలదించుకోవాల్సిన అంశమన్నారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదంటే వెంటనే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడ వెంటిలేటర్లు, ఇతర వసతులను కల్పించాలని సూచించారు. మందులు, ఇతరత్రాలనూ అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బందిని సముచితంగా నియమించాలని డిమాండ్ చేశారు. కొత్త ఆసుపత్రి లేదా వైద్య కళాశాలను ప్రారంభించేటప్పుడు పాత సిబ్బందిని తొలగించరాదన్నారు. నాగపూర్ వైద్య కళాశాల ఆసుపత్రి, ఇందిరాగాంధీ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువని, ఏటా పది లక్షల మందికిపైగా వస్తారని చెప్పారు. ఈ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలని అన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిస్థితులను మెరుగుపర్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని పవార్ డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి గిరీశ్ మహాజన్... వెంటిలేటర్ల కారణంగా మరణాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

విజ్ఞానయాత్ర విషాదాంతం

15 మంది విద్యార్థులు దుర్మరణం

బోల్తా పడిన బస్సు

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లోని నోనీ జిల్లాలో బుధవారం ఓ బస్సు ఘోర ప్రమాదానికి గురైంది. స్టడీ టూర్‌కు వెళ్లిన విద్యార్థులు 15మంది ఈ ఘటనలో దుర్మరణం పాలైనట్టు సమాచారం. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నోనీ జిల్లాకు చెందిన థంబాల్ను స్కూల్ విద్యార్థులు రెండు బస్సుల్లో స్టడీ టూర్‌కు వెళ్లారు. మార్గమధ్యలో లాంగ్‌సాయ్ ప్రాంతంలో అమ్మాయిలు ప్రయాణిస్తోన్న బస్సు ప్రమాదానికి గురైంది. మలుపులో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు జారి బోల్తా పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలంలో ఎస్డీఆర్ఎఫ్ బృందం, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో 15 మంది మృతిచెందినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే మరణాలపై అధికారిక సమాచారం లేదు. మరోవైపు ఘటనలో 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని కథనాలు చెబుతున్నాయి. ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలను ట్విటర్‌లో షేర్ చేసిన ఆయన, ఘటనాస్థలంలో సహాయకచర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

వైరస్ వ్యాప్తిపై ఆందోళన వద్దు: పూనావాలా



న్యూఢిల్లీ: జపాన్, దక్షిణ కొరియా, బ్రెజిల్, చైనా, అమెరికాల్లో కరోనా కేసులు విజృంభిస్తుండటంపై సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) సీఈఓ అదర్ పూనావాలా బుధవారం స్పందించారు. భారత్‌లో వాక్సిన్ విస్తృతంగా పంపిణీ జరిగినందున భయపడాల్సిన అవసరం లేదన్నారు. భారత ప్రభుత్వం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని ఆయన ప్రజలను కోరారు. మనం ఇప్పటికే విస్తృత స్థాయిలో వాక్సిన్ పంపిణీ చేశామని, వాక్సిన్లు మెరుగ్గా పనిచేస్తున్నందున భయపడాల్సిన అవసరం లేదన్నారు. చైనాలో కరోనా కేసుల విజృంభణపై భారత మాజీ దౌత్యవేత్త కె.పి. ఫాబియన్ ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా కేసులు ఒక్కసారిగా పెరుగుతున్న నేపథ్యంలో, వైరస్‌లో కొత్తగా తలెత్తుతున్న వేరియంట్లను గుర్తించేందుకు పాజిటివ్ శాంపిల్స్ మొత్తం జన్యు సీక్వెన్సింగ్‌ను పెంచాలని అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్రం ఆదేశించిన సంగతి తెలిసిందే. జన్యు సీక్వెన్సింగ్ చేస్తే దేశంలో కొత్త వేరియంట్లు ఏవైనా తలెత్తితే సకాలంలో వాటిని గుర్తించడానికి, అవసరమైన ప్రజారోగ్య చర్యలు చేపట్టడానికి వీలు ఉంటుందని చెప్పారు. ఇప్పటివరకు అనేక దేశాల్లో కరోనా వైరస్ వ్యాప్తి అదుపులోనే ఉన్నప్పటికీ ఇటీవల కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతున్నట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతివారం కొత్తగా 35లక్షల కొవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ముఖ్యంగా చైనా, జపాన్, అమెరికా, బ్రెజిల్, దక్షిణ కొరియా సహా పలు దేశాల్లో ఇవి గణనీయంగా రికార్డవుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన భారత ప్రభుత్వం.. ప్రపంచ దేశాల్లో వైరస్ పరిస్థితులపై అంచనా వేసేందుకు వైద్య నిపుణులతో బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించింది. కొత్త వేరియంట్లు, రాష్ట్రాల్లో జీనోమ్ సీక్వెన్సింగ్ పెంచడం, అంతర్జాతీయ ప్రయాణికులకు మార్గదర్శకాలు వంటి అంశాలపై నిపుణులతో చర్చించింది.

దర్యాప్తు సంస్థలతో బీజేపీ ఆకర్ష్

ఈడీ, సీబీఐ బీజేపీ చేతిలో కీలుబొమ్మలు

కమలనాథుల కోసం మధ్యవర్తిత్వం

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చెప్పిందే వేదమన్నట్లు ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. ఆదేశాల ఆచరణమే తమ విధి ధర్మమన్నట్లు ప్రవర్తిస్తున్నాయి. బీజేపీ ప్రభుత్వ చేతిలో కీలుబొమ్మలుగా మారి వారికి రాజకీయంగా లబ్ధి చేకూర్చేందుకు చివరికి మధ్యవర్తిత్వానికి దిగజారడం శోచనీయం.

మోదీ వచ్చాక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దూకుడు పెంచి విపక్షాలపై విరుచుకుపడ్డాయి. అవినీతి, అక్రమాస్తులు తదితర కేసుల్లో ఇరికిస్తూ వారిని ఒత్తిడికి గురిచేశాయి. ఆమ్ ఆద్మీపార్టీ (ఆమ్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల మాట్లాడుతూ, తనకు ఒక్క రోజు కోసం ఈడీ, సీబీఐ పగ్గాలు అప్పగిస్తే బీజేపీలోని సగం మందిని జైలుకు పంపుతానన్నారు. ఏడేళ్లలో ఆప్ నేతలపై 167 కేసులు పెట్టగా కోర్టుల్లో ఒక్కటీ రుజువు కాలేదని చెప్పారు. 150 కేసులను కొట్టివేశారన్నారు. 800 మంది అధికారులు ఆప్‌పై విరుచుకుపడ్డారని, డిప్యూటీ సీఎంపైనా ఎఫ్ఐఆర్ ఉందని అన్నారు. మోదీ హయాంలో ఎంతలా దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం అయ్యారో వెల్లడించారు. ఇదే విధంగా కాంగ్రెస్‌పై 24 కేసులు ఉంటే తృణమూల్ కాంగ్రెస్ (19), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (11) చొప్పున ప్రాసిక్యూషన్లు ఎదుర్కొన్నాయి. ఆ తర్వాత ఈడీ సోదాలు 27రెట్లు పెరిగాయి. 2004-14లో 112 దాడులు జరిగితే 2014-22లో ఏకంగా 3,010 దాడులు జరిగాయి. ఈ దాడులన్నీ దాదాపుగా మోదీ ప్రత్యర్థులపైనే జరిగాయి.

విపక్ష నేతలు బీజేపీలో చేరేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు మధ్యవర్తిత్వం సైతం వహించాయి. ఈ మేరకు ఆడియోను ఆప్ నేత మనీశ్ సిసోడియా బయట పెట్టారు. బీజేపీలో చేరితే తనపై కేసులు కొట్టివేస్తామన్నారని తెలిపారు. బీజేపీలో చేరేలా ఒత్తిడి తెచ్చేందుకు నలుగురు ఆప్ ఎమ్మెల్యేలపై ఈడీ/సీబీఐ దాడులు జరిగాయి. కేసుల పేరిట వారిని బెదిరించారు. రాజకీయ లబ్ధి కోసం దర్యాప్తు సంస్థలను ఇంతలా దిగజార్చడం మోదీ ప్రభుత్వానికే సాధ్యం.

మహారాష్ట్రలో ఆపరేషన్ కమలం విజయంతో రెచ్చిపోయిన కాషాయ పార్టీ దిల్లీ, చత్తీస్‌గఢ్, తెలంగాణ, పంజాబ్‌లోనూ ఇదే వ్యూహాన్ని అనుసరించింది. పదవులకు బదులు డబ్బు ఆశ చూపి విపక్ష సభ్యులను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేసింది. ఇతర పార్టీల టికెట్లపై గెలిచిన 277 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారని కేజ్రీవాల్ కూడా చెప్పారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.20 కోట్లు ముట్టాయని, ఈ లెక్కన అధికార పార్టీ రూ.5,500 కోట్లు ఖర్చు చేసిందన్నారు. బీజేపీలో చేరితే రూ.20 కోట్లు ఇస్తామన్నారని దిల్లీలో నలుగురు ఆప్ ఎమ్మెల్యేలు చెప్పిన ఆధారంగా ఆయన ఈ ఆరోపణలు చేశారు. నిరాకరించినందుకే నలుగురు ఆప్ ఎమ్మెల్యేలు ఈడీ దాడులను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. బీజేపీ బ్రోకర్లు రూ.1,075 కోట్లతో 43 మంది దిల్లీ ఎమ్మెల్యేలను కొనాలనుకున్నట్లు సిసోడియా బయట పెట్టిన ఆడియోలో ఉన్నది. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు రూ.100 కోట్లు ఇస్తామని చెప్పడం అందులో ఉంది.

తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఆపరేషన్ కమలానికి తోడు టీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలపై చర్యలూ మొదలుపెట్టింది. అయితే కాషాయ పార్టీ వ్యూహం తెలంగాణ పోలీసులకు ముందే తెలిసి పోవడంతో సీన్ రివర్స్ అయింది. తెలంగాణ ముఖ్యమంత్రి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి కోడ్‌లలో ముట్టజెప్పే డబ్బుల గురించి సంభాషణను బయటపెట్టారు. తొలుత 20-30 మంది ఎమ్మెల్యేల ఫిరాయింపులకు ప్రణాళికలు సిద్ధం కాగా ఏజెంట్లు తెలంగాణ పోలీసులకు పట్టుబడ్డారు.

రాజస్థాన్‌లోని, గుర్గావ్ రిసార్ట్ వేదికగా ఎమ్మెల్యేకు రూ.10 కోట్లు చొప్పున బేరం కట్టారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తే రూ.25 కోట్లు ఇస్తామన్నారని రాజస్థాన్‌లోని కాంగ్రెస్ మంత్రి ఒకరు చెప్పారు.

ఆపరేషన్ కమలంలో భాగస్వాములయ్యారన్న ఆరోపణలతో ముగ్గురు జార్ఖండ్ ఎమ్మెల్యేలు బెంగాల్‌లో అరెస్టు అయ్యారు. వారి నుంచి హవాలా డబ్బును ఆ రాష్ట్ర సీఐడీ స్వాధీనం చేసుకున్నది. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం కూడా ఆపరేషన్ కమలాన్ని తిప్పికొట్టింది. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్లు ఇస్తామని చెప్పినట్లు ఆరోపణలు చేసింది.

బీజేపీ చాణక్యుడు, ప్రభుత్వాలను కూల్చే సూత్రధారి అమిత్‌షా బృందంలో కీలకంగా వ్యవహరించిన నాగపూర్‌లోని పార్టీ నేత బీఎల్ సంతోశ్ తెలంగాణ కేసులో రెండు సమన్లను తప్పించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి విడుదల చేసిన ఆడియోలో బీజేపీ అగ్రనేతల ప్రస్తావన 23సార్లు వచ్చింది. 'ఇప్పటికే ఎనిమిది రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చివేశాం. ఇక తెలంగాణ, దిల్లీ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ వంతు' అని ఓ మధ్యవర్తి చెప్పడం ఉంది. ఈశాన్యంలో దాదాపు అన్ని చోట్ల ఫిరాయింపుల వల్లే ఆ పార్టీ గెలిచింది. ఎనిమిదేళ్లలో 93 మంది ఎమ్మెల్యేలు పార్టీలు ఫిరాయించారు. జేడీఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 11, ఇద్దరు స్వతంత్రులు కర్ణాటక బీజేపీలో చేరారు. దీంతో మూడేళ్ల తర్వాత ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగలిగింది. గోవాలో మొదటి విడత ఫిరాయింపులు జరిగిన రెండు నెలల్లోనే మరో 11 మంది కాషాయ కండువా కప్పుకున్నారు. దీంతో ఆ రాష్ట్రంలోని 40 మందితో కూడిన సభలో కాంగ్రెస్ కేవలం ముగ్గురు ఎమ్మెల్యేలకు పరిమితం అయింది.

చార్లెస్ శోభరాజ్ విడుదల

నేపాల్ సుప్రీంకోర్టు ఉత్తర్వులు

ఖాట్మండు: సీరియల్ కిల్లర్ చార్లెస్ శోభరాజ్ విడుదల కానున్నారు. ఈ మేరకు నేపాల్ సుప్రీంకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇతర పెండింగ్ కేసులు లేకపోతే 15 రోజుల్లోగా శోభరాజ్ ఆయన స్వదేశానికి చేరుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత యంత్రాంగానికి న్యాయ స్థానం సూచించింది. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఈయనకు విముక్తి ప్రసాదిస్తూ జస్టిస్ స్వప్న ప్రధాన్ మల్ల, జస్టిస్ తిలక్ ప్రసాద శ్రేష్ట ధర్మాసనం ఆదేశాలిచ్చింది. శోభరాజ్ 2003 నుంచిజైల్లో ఉన్నారు. ఇద్దరు ఉత్తర అమెరికా పర్యాటకుల హత్య కేసులో శోభరాజ్‌కు 20ఏళ్ల జైలు శిక్ష పడింది. తనకు పడిన శిక్షా కాలానికి మించి నిర్బంధంలో ఉన్నట్లు శోభరాజ్ ఫిర్యాదు చేసుకున్న క్రమంలో నేపాల్ సర్వోన్నత న్యాయస్థానం డివిజన్ బెంచ్ కేసును పరిశీలించి, ఆయన విడుదలకు ఆదేశాలిచ్చింది. 75శాతం జైలుశిక్ష పూర్తి చేసుకుని, నిర్బంధకాలంలో సత్ప్రవర్తన కనబర్చిన ఖైదీలను విడుదల చేసేందుకు చట్టప్రకారం వెసులుబాటు ఉన్నది.

రేపు కడపకు సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23వ తేదీ నుంచి 25 వరకు కడప జిల్లాలో పర్యటించనున్నారు. 23వ తేదీ శుక్రవారం అమీన్‌పూర్ దర్గాకు వెళ్తారు. 12 గంటల నుంచి ప్రార్థనలో పాల్గొంటారు. 1.30కు అఫ్జల్ ఖాన్ కుమారుడి పెళ్లికి హాజరవుతారు. 2 గంటలకు కడప విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో కమలాపురం వెళతారు. అక్కడ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి...బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు హెలికాప్టర్‌లో ఇడుపులపాయ చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు.

జరిమానా చెల్లించలేని ఖైదీలకు విముక్తి

కేంద్రమంత్రి అజయ్ కుమార్

న్యూఢిల్లీ: శిక్ష పూర్తి చేసి...జరిమానా చెల్లించలేక జైళ్లలో మగ్గుతున్న ఖైదీలను విడుదల చేయాలని రాష్ట్రాలకు సూచించినట్లు కేంద్రప్రభుత్వం రాజ్యసభకు వెల్లడించింది. బిల్కిస్ బానో కేసు దోషుల విడుదలను ప్రస్తావిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న ఖైదీల్లో 80శాతం మంది విచారణ ఖైదీలేనని, వీరి సంఖ్యను తగ్గించేందుకు తీసుకునే చర్యలు ఏమిటని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ సమాధానమిచ్చారు. శిక్ష పూర్తి చేసుకున్నప్పటికీ జరిమానా చెల్లించలేక జైళ్లలో ఉన్న ఖైదీలను విడుదల చేసేందుకు ప్రత్యేక పథకాన్ని రూపొందించామని చెప్పారు. ఆగస్టు 15, జనవరి 26 సందర్భంగా అలాంటివారిని విడుదల చేసేలా అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. దేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రమైనదని.. విచారణ ఖైదీలపై నిర్ణయం తీసుకునే అధికారం కోర్టులకు మాత్రమే ఉంటుందని చెప్పారు. ఈ సమాధానంతో సంతృప్తి చెందని ఎంపీ.. విచారణ ఖైదీలు జైళ్లలో మగ్గిపోతుండటంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా ఆందోళన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదల రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినదా లేక కేంద్రహోంశాఖ పరిధిలోనిదా? అని ప్రశ్నించారు. అజయ్ కుమార్ స్పందిస్తూ శిక్ష పూర్తి చేసుకున్న వారికి సంబంధించి రాష్ట్రాలకు ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేశామని తెలిపారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల వయోపరిమితి పెంచాలి

జగన్ చిత్రపటానికి ఉద్యోగ పోరాట సమితి, యువజన, విద్యార్థుల వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకాల వయో పరిమితి పెంచాలని డిమాండ్ చేస్తూ సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి విజయవాడ దాసరి భవన్ దగ్గర ఉద్యోగ పోరాట సమితి, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎస్‌యూఐ నేతలు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకాలకు ఐదేళ్లు వయోపరిమితి పెంచాలని నినదిస్తూ, మోకాళ్ల మీద నిలబడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎ.రవిచంద్ర, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితి 27 ఏళ్లలోపు ఉండాలని ప్రభుత్వం ప్రకటించడం దారుణమని, 32 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆవేదనను వినేందుకు కూడా ఇష్టపడడం లేదని, వారిని కలిసేందుకు కూడా అవకాశం కల్పించకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సీఎం చిత్రపటానికి వినతి పత్రాలు అందజేస్తున్నామని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల దగ్గర ధర్నాలు చేపట్టామని తెలిపారు.

హోం మంత్రి తానేటి వనిత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రాలు అందజేసినా స్పందించలేదన్నారు. ఈ నిరసనలో ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఇంజారపు రాజేష్, అయ్యప్ప పాల్గొన్నారు.

షారూఖ్‌ను సజీవ దహనం చేస్తా: పరమహంస





ముంబై: బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ సినిమా 'పఠాన్'పై కొన్ని రోజులుగా వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకొనే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా నుంచి ఇటీవలే 'బేషరమ్ రంగ్' అనే సాంగ్‌ని చిత్రబృందం విడుదల చేసింది. అందులో దీపిక బికినీ కనిపించింది. అలాగే కొన్ని డ్యాన్స్ మూవ్‌మెంట్స్ అభ్యంతరకరంగా ఉన్నాయి. ఇది నెటిజన్ల కోపానికి కారణమైంది. దీంతో ఈ చిత్రంపై ఎంతోమంది సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేశారు. తాజాగా అయోధ్యకి చెందిన ఓ సాధువైతే ఏకంగా షారుఖ్ ఖాన్ కలిస్తే సజీవ దహనం చేస్తానని బెదిరింపులకు దిగారు. అయోధ్యకు చెందిన తపస్వి ఛావ్నీకి చెందిన మహంత్ పరమహంస ఆచార్య ఈ వ్యాఖ్యలు చేశారు. 'మన సనాతన ధర్మానికి చెందిన ప్రజలు దీని గురించి నిరంతరం నిరసనలు చేస్తున్నారు. ఈరోజు షారుఖ్ ఖాన్ పోస్టర్‌ను తగులబెట్టాం. నేను షారుఖ్ ఖాన్‌ను కలిసినట్లయితే, అతనిని సజీవ దహనం చేస్తా' అని సాధువు చెప్పుకొచ్చారు. అలాగే 'బేషరమ్ రంగ్' సాంగ్‌లో కాషాయ రంగును అవమానించారని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ఈ చిత్రాన్ని బాయ్‌కాట్ చేయాలని పిలుపునిచ్చారు. 'పఠాన్' సినిమాను థియేటర్లలో విడుదల చేస్తే వాటిని తగులబెడతానని ఆచార్య చెప్పుకొచ్చారు. ఇంతకుముందు హనుమాన్ గర్హి పూజారి మహంత్ రాజు దాస్ కూడా సినిమాపై నిరసన వ్యక్తం చేశారు.

సినిమా చరిత్రలోనే అతి పెద్ద స్టంట్

లండన్: డేర్ డెవిల్ స్టంట్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న నటుడు టామ్ క్రూజ్. 'టాప్ గన్', 'నైట్ అండ్ డే', 'ది మమ్మీ' చిత్రాలతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేశాడు. టామ్ హీరోగా నటించిన యాక్షన్ సినిమా 'మిషన్ ఇంపాజిబుల్'. ఇథన్ హంట్ అనే స్పై ఏజెంట్ పాత్రను పోషించాడు. 1996లో విడుదలైన ఈ చిత్రం సంచలన విజయం సాధించింది. ఫలితంగా మేకర్స్ ఈ ప్రాజెక్టును ఫ్రాంచైజీగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఆరు భాగాలుగా వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టింది. త్వరలోనే ఏడో భాగం 'మిషన్ ఇంపాజిబుల్: ది డెడ్ రెకనింగ్ పార్ట్ 1' టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఏడాది జులై 14న విడుదల కానుంది. 'మిషన్ ఇంపాజిబుల్: ది డెడ్ రెకనింగ్ పార్ట్-1' కోసం టామ్ క్రూజ్ సాహసోపేతమైన స్టంట్స్ చేస్తున్నాడు. ఈ యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన వీడియోను హీరో సోషల్ మీడియా వేదికగా విడుదల చేశాడు. సినిమా హిస్టరీలోనే బిగ్గెస్ట్ స్టంట్ అని మేకర్స్ అభివర్ణిస్తున్నారు. మోటర్ సైకిల్‌ను డ్రైవ్ చేస్తూ పర్వత శిఖరం మీద నుంచి దూకాడు. ఈ స్టంట్ కోసం ఏడాది పాటు శిక్షణ తీసుకున్నాడు. రోజూ మోటోక్రాస్ ట్రైనింగ్‌తో పాటు 30బేస్ జంప్స్, 500స్కై డైవింగ్స్ చేశాడు.

ఇండియన్2... మేకప్‌కే ఐదు గంటలు

చెన్నై: విశ్వనటుడు కమల్‌హాసన్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఇండియన్-2' సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్. తాజాగా రకుల్ ఈ చిత్ర విశేషాలను చెప్పుకొచ్చింది. ఆమె మాట్లాడుతూ.. 'ఇందులో కమల్ హాసన్ వృద్ధుడి పాత్రలో నటిస్తు న్నారు. వృద్ధుడి గెటప్ కోసం మేకప్ వేసేందుకు ఏకంగా ఐదు గంటల సమయం పడుతుంది. ఇందుకోసం ఆయన తెల్లవారు జామున 5 గంటలకే షూటింగ్ స్పాట్‌కు వస్తున్నారు. అప్పటి నుంచి మేకప్ ప్రారంభిస్తే, పూర్తయ్యేందుకు ఉదయం 10 గంటలవుతుంది. షూటింగ్ పూర్తయిన తర్వాత ఆ మేకప్ తొలగించేందుకే రెండు గంటల సమయం తీసుకుంటుంది. అప్పటి వరకు ఆయన ఎంతో ఓపిగ్గా, ప్రశాంతంగా కూర్చొనివుంటారు. ఆరు దశాబ్దాలుగా సినీ రంగంలో కొనసాగుతున్న కమల్.. ఎన్నో సిల్వర్ జూబ్లీ హిట్స్ చూశారు. ఇండస్ట్రీ, ప్రేక్షకుల పల్స్, ఇతర సినిమా విషయాల గురించి ఆయనకు తెలిసినంతగా మరొకరికి తెలియదని నేను నమ్ముతున్నాను' అని చెప్పుకొచ్చారు. ఈమె 'ఇండియన్-2'తో పాటు ఆర్.రవికుమార్ దర్శకత్వంలో మరో చిత్రంలో నటిస్తోంది.

అర్చక సంక్షేమ వెబ్‌సైట్ ప్రారంభం

అర్చక సంక్షేమ పథకాల మంజూరుకు అవకాశం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అర్చక సంక్షేమ వెబ్‌సైట్ (www.aparchakawelfare.org)ను ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. అమరావతి సచివాలయం రెండో బ్లాక్‌లోని ఆయన చాంబరులో ఈ వెబ్ సైట్‌ను ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్చక సంఘాల అభ్యర్థన మేరకు ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారని, అర్చకుల సంక్షేమార్థం అమలు చేస్తున్న వివిధ పథకాలకు వెబ్‌సైట్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలోని ఆలయాల్లో పనిచేసే అర్చకుల సంక్షేమం కోసం, అర్చక, ఉద్యోగుల సంక్షేమ నిధి ద్వారా ఎప్పటికప్పుడు నూతన పథకాలను రూపకల్పన చేసి అమలు చేస్తున్నామన్నారు. ఉపనయనం, విద్యా గ్రాంటుతో పాటు అర్చక, ఉద్యోగుల పిల్లల వివాహం, గృహ నిర్మాణం, మరమ్మతులు, వైద్య ఖర్చులు, ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందిన వారికి ఆర్థిక సహాయాన్ని అందజేశారన్నారు. పదవీ విరమణ గ్రాట్యుటీ, కారుణ్య ధన సహాయం అందజేయడంతో పాటు వేద విద్యను ప్రోత్సహించేందుకు ఎన్నో చర్యలను తీసుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకాల మంజూరు కోసం అర్చకులు సంబంధిత అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎం.హరి జవహర్‌లాల్, అదనపు కమిషనర్లు టి.చంద్రకుమార్, కె.రామచంద్రమోహన్, జాయింట్ కమిషనర్ ఎస్.ఎస్.చంద్రశేఖర్ ఆజాద్, అర్చక వెల్ఫేర్ అసిస్టెంట్ కమిషనర్ వీవీఎస్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

రాహుల్ డౌట్...అభిమన్యు ఈశ్వరన్ ఇన్?

ఢాకా: బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌కు ముందు టీమిండియాకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పటికే గాయాలతో యువ పేసర్ నవ్‌దీప్ సైనీ, కెప్టెన్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌కు దూరం కాగా.. తాజాగా ఈ జాబితాలోకి తాత్కాలిక కెప్టెన్ కేఎల్ రాహుల్ కూడా చేరాడు. బుధవారం ప్రాక్టీస్ సెషన్‌లో కేఎల్ రాహుల్ చేతికి తీవ్ర గాయమైనట్లు తెలుస్తోంది. దాంతో అతను గురువారం ప్రారంభమయ్యే రెండో టెస్ట్ ఆడటంపై సందేహాలు నెలకొ న్నాయి. ఒకవేళ రాహుల్ దూరమైతే.. వైస్ కెప్టెన్ చతేశ్వర్ పుజారా జట్టును నడిపించనున్నాడు. రాహుల్ స్థానంలో యువ ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేయనున్నాడు. అయితే టీమిండియా బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ మాత్రం కేఎల్ రాహుల్ రెండో టెస్ట్ ఆడుతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. రెండో టెస్ట్ నేపథ్యంలో బుధవారం మీడి యాతో మాట్లాడిన విక్రమ్ రాథోడ్.. కేఎల్ రాహుల్ గాయంపై కీలక వ్యాఖ్యలు చేశా డు. 'రాహుల్‌కు అయిన గాయం పెద్దది అయితే కాదు. అతను ఫిట్‌గానే కనిపిస్తు న్నాడు. దాక్టర్లు గాయాన్ని పరిశీలిస్తు న్నారు. రేపటి మ్యాచ్ వరకు అతను పూర్తిగా కోలుకొని జట్టుకు అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నా'అని విక్రమ్ రాథోడ్ చెప్పుకొచ్చాడు. విక్రమ్ రాథోడ్ కారణంగానే రాహుల్ గాయపడినట్లు తెలుస్తోంది. బుధవారం ప్రాక్టీస్ సెషన్‌లో విక్రమ్ త్రోడౌన్స్‌ను రాహుల్ ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలో ఓ బంతి కేఎల్ రాహుల్ ఆర్మ్‌ను బలంగా తాకింది. దాంతో నొప్పితో విలవిలలాడిన రాహుల్ వెంటనే.. ఫిజియోల దగ్గరకు పరుగెత్తాడు. ఇక రోహిత్ శర్మ గైర్హాజరీలో జట్టును నడిపిస్తున్న రాహుల్.. ఈ పర్యటనలో గాయపడ్డ 8వ భారత ప్లేయర్ కావడం విశేషం. ఈ పర్యటన ప్రారంభానికి ముందే మహమ్మద్ షమీ, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా గాయాలతో జట్టుకు దూరం కాగా.. దీపక్ చాహర్, రోహిత్ శర్మ రెండో వన్డేలో గాయపడ్డారు. రెండో టెస్టుకు ముందు నవ్‌దీప్ సైనీ, కేఎల్ రాహుల్ గాయాల బారిన పడ్డారు.

నేటి నుంచి బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్

రికార్డులకు చేరువలో పుజారా, అశ్విన్

రికార్డులకు చేరువలో అశ్విన్

ప్రస్తుతం అశ్విన్ 87 టెస్టుల్లో 2,989 పరుగుల వద్ద ఉన్నాడు. మరో 11 పరుగులు చేస్తే 3వేల మార్క్‌ను అందుకొన్న బ్యాటర్‌గా అవతరిస్తాడు. తొలి టెస్టు మ్యాచ్‌లో అర్ధశతకం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఇందులో పెద్ద విశేషం ఏముందంటారా...? టెస్టుల్లో 400కిపైగా వికెట్లు తీయడంతో పాటు మూడు వేల పరుగులను చేసిన కపిల్ దేవ్, షేన్ వార్న్, రిచర్డ్ హ్యాడ్లీ, షాన్ పొలాక్ సరసన చేరతాడు. మరో ఏడు వికెట్లు తీస్తే.. అత్యంత వేగంగా 450 వికెట్లను తీసిన భారత బౌలర్ గానూ.. అంతర్జాతీయంగా రెండో ఆటగాడిగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ప్రస్తుతం 443 వికెట్లతో కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు అనిల్ కుంబ్లే (93వ మ్యాచ్‌ల్లో) పేరిట ఈ రికార్డు ఉంది. అయితే, అంతర్జాతీయంగా మాత్రం.. శ్రీలంక దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ కేవలం 80 టెస్టుల్లోనే ఈ ఘనత సాధించాడు.

పుజారా ఖాతాలోనూ...

తొలి టెస్టుల్లో సెంచరీ సాధించి ఫామ్‌లోకి వచ్చిన ఛతేశ్వర్ పుజారా మరో రికార్డుకు చేరువగా వచ్చాడు. బంగ్లాతో రెండో మ్యాచ్‌లో కేవలం 16 పరుగులు చేస్తే టెస్టు కెరీర్‌లో 8వేల పరుగులు చేసిన ఎనిమిదో భారత బ్యాటర్ అవుతాడు. గతంలో సచిన్, రాహుల్ ద్రవిడ్, సునిల్ గావస్కర్, వీవీఎస్ లక్ష్మణ్, వీరేందర్ సెహ్వాగ్, విరాట్ కోహ్లీ, సౌరభ్ గంగూలీ మాత్రమే ఈ మార్క్‌ను దాటారు.

ఐపీఎల్2023: ముంబై ఇండియన్స్‌లోకి ఆడమ్ జంపా

న్యూఢిల్లీ: ఐపీఎల్ 2023 మినీ వేలానికి రంగం సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో(డిసెంబర్ 23) ఈ మెగా ఆక్షన్‌కు తెరలేవనుంది. కేరళలోని కొచ్చి వేదికగా మధ్యాహ్నం 2.30 గంటలకు ఆటగాళ్ల వేలం ప్రారంభమవుతుందని బీసీసీఐ ఇప్పటికే ప్రకటించింది. మొత్తం 991 మంది ఆటగాళ్లు మినీ వేలానికి రిజిస్టర్ చేసుకోగా.. ఫ్రాంచైజీలు 405 మంది ఆటగాళ్ల పేర్లను షార్ట్‌లిస్ట్ చేశాయి. ఇందులో గరిష్టంగా 87 మంది ఆటగాళ్లకు అవకాశం దక్కనుంది. ఇందులో 30 స్లాట్స్ ఓవర్‌సీస్ ఆటగాళ్లకు దక్కనుండగా.. మరో 57 స్థానాల కోసం భారత ఆటగాళ్లు పోటీపడనున్నారు. షార్ట్ లిస్ట్ చేసిన 405 మంది ఆటగాళ్లను మొత్తం ఐదు సెట్లుగా విభజించారు. మినీ వేలానికి టైమ్ దగ్గరపడుతున్నా కొద్దీ ఫ్రాంచైజీల వ్యూహాలు, టీమ్స్ కొనుగోలు చేసే ఆటగాళ్ల ప్రిడిక్షన్స్ జోరు అందుకున్నాయి. ఈ క్రమంలోనే ముంబై ఇండియన్స్ ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపాను కొనుగోలు చేసే అవకాశం ఉందని టీమిండియా మాజీ క్రికెటర్, వివాదాస్పద కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ అన్నాడు. గత సీజన్‌లో దారుణంగా విఫలమైన ముంబై ఇండియన్స్.. మినీ వేలంలో బౌలర్లపైనే ప్రధానం దృష్టి పెడుతుందని జోస్యం చెప్పాడు. అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ గేమ్ ప్లాన్ షోలో మాట్లాడిన మంజ్రేకర్.. ముంబై ఇండియన్స్ రషీద్ ఖాన్, సునీల్ నరైన్ వంటి బౌలర్ల కోసం ఎదురు చూస్తోందని తెలిపాడు. 'గత సీజన్‌లో సరైన బౌలింగ్ దాడి లేకపోవడం వల్ల ముంబై ఇండియన్స్ చాలా ఇబ్బంది పడింది. అయితే ఈసారి బుమ్రాతోపాటు జోఫ్రా ఆర్చర్ కూడా వచ్చేస్తాడు. అలాగే జాసన్ బెహ్రెన్‌డార్ఫ్ కూడా ఉండటం పేస్ బౌలింగ్ పటిష్టంగా అనిపిస్తోంది. రోహిత్ శర్మ ఫామ్‌లోకి వచ్చాడు. అయితే ప్రతీ ఫ్రాంచైజీ కూడా రషీద్ ఖాన్ లాంటి లెగ్ స్పిన్నర్‌ను తీసుకోవడానికి మొగ్గు చూపుతోంది. కాబట్టి ముంబై కూడా ఇలానే ఆలోచించే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే జట్టులో మార్కండే ఉన్నప్పటికీ.. జంపా, అదిల్ రషీద్ వంటి అంతర్జాతీయ స్పిన్నర్‌ను తీసుకోవడానికి ముంబై ఇండియన్స్ ప్రయత్నించవచ్చు" అని సంజయ్ మంజ్రేకర్ చెప్పుకొచ్చాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.